ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5

అనకాపల్లి

జిల్లా వార్తలు

సోమవారం 22 సెప్టెంబరు 2025





ఎస్.రాయవరంలో గురజాడ అప్పారావు కాంస్య విగ్రహానికి పూల మాలలు వేసిన దృశ్యం

మహాకవి గురజాడకు ఘన నివాళి

మహాకవి, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతిని జిల్లాలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గురజాడ జన్మస్థలమైన ఎస్.రాయవరంలో గురజాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిపారు. గురజాడ అప్పారావు కాంస్య విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- ఎస్.రాయవరం/ఆంధ్రజ్యోతి

ఈదురు గాలుల బీభత్సం

ఎలమంచిలిలో పలు చోట్ల నేలకొరిగిన చెట్లు, విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

- గంటన్నర పాటు భారీ వర్షం
- రహదారులు జలమయం
- జనజీవనానికి అంతరాయం
- సబ్బవరంలోనూ అదే పరిస్థితి

ఎలమంచిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

ఎలమంచిలి పట్టణంలో ఆదివారం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. మధ్యాహ్నం 2 గంటల నుంచి 3.30 గంటల వరకు ఈదురు గాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఎక్కడికక్కడే విద్యుత్ తీగలపై చెట్ల కొమ్మలు పడ్డాయి. గంటన్నర పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో 50 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జనజీవనానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది.



ఎలమంచిలి ఎల్‌ఐసీ కార్యాలయం ఎదుట నిలిపి ఉన్న కారుపై పడిన చెట్టు, విద్యుత్ తీగలు

ప్రధానంగా లైను కొత్తూరు ప్రధాన రోడ్డు, పెదపల్లి జంక్షన్ సమీపంలో హైవేపై చెట్లు పడిపోవడంతో కొద్ది సేపు వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. పట్టణంలో పలు ప్రధాన రోడ్లు జలమయమయ్యాయి. ప్రధాన రోడ్డు, కొత్తపేట, ఎల్‌ఐసీ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయం రోడ్డు, క్లబ్ రోడ్లపై వర్షపు నీరు ప్రవహించింది. పోస్టాఫీసు వీధిలో విద్యుత్ తీగలపై చెట్లు పడిపోవడంతో తీగలు తెగిపోయాయి. దీంతో అంధకారం నెలకొంది. కొక్కిరాపల్లి సమీపంలో పిడుగుపాటుకు గేదె మృతి చెందింది. విద్యుత్, మునిసిపల్, అగ్నిమాపక, రెవెన్యూ, శానిటరీ, పోలీసు శాఖల అధికారులు రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టారు. ఈ వర్ష బీభత్సానికి సుమారు 20కిపైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగి ఉండవచ్చని విద్యుత్ శాఖ ఏఈ తెలిపారు. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు జోరుగా సాగుతున్నాయి.




ఎలమంచిలిలోని పోస్టాఫీసు కార్యాలయం రోడ్డులో నేలకొరిగిన చెట్టు, తెగిన విద్యుత్ తీగలు

సబ్బవరంలో...

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురవడంతో పలు చోట్ల విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. పలు ప్రాంతాలు ... మిగతా 8వ పేజీలో

నేడు విశాఖకు సీఎం చంద్రబాబు రాక



విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం విశాఖ నగరానికి రానున్నారు. ఉదయం ఎనిమిది గంటలకు ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 9.30 గంటలకు నగరంలోని కోస్టల్ బ్యాటరీ వద్ద గల హెలిప్యాడ్‌కు, అక్కడి నుంచి 9.40 గంటలకు నోవాటెల్ హోటల్‌కు చేరుకుంటారు. ఉదయం 9.45 గంటలకు జరగనున్న ఈ గవర్నెన్స్ సదస్సుకు సంబంధించిన ఎగ్జిబిషన్ ప్రారంభించిన అనంతరం సదస్సులో పాల్గొంటారు. ఉదయం 11.45 గంటలకు నోవాటెల్ నుంచి బయలుదేరి కోస్టల్ బ్యాటరీకి చేరుకుని, మధ్యాహ్నం 12 గంటలకు హెలికాప్టర్‌లో ఉండవల్లి వెళతారు.

కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ రాక

కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎర్త్ సైన్స్ సహాయమంత్రి జితేంద్రసింగ్ సోమవారం విశాఖ వస్తారు. భువనేశ్వర్ నుంచి విమానంలో మధ్యాహ్నం 1.55 గంటలకు విశాఖ ఎయిర్‌పోర్టుకు చేరుకుని 2.30 గంటలకు నోవాటెల్ హోటల్‌కు చేరుకుంటారు. మధ్యాహ్నం మూడు గంటల నుంచి 4.30 గంటల వరకు ఈ గవర్నెన్స్ సదస్సులో పాల్గొంటారు. అనంతరం ఢిల్లీ వెళతారు.

జోరుగా కేజీబీవీల్లో అభివృద్ధి పనులు

13 విద్యాలయాలకు రూ.21.52 కోట్లు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం

- పనులు పూర్తయితే విద్యార్థినులకు తప్పనున్న కష్టాలు

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) అదనపు వసతుల కల్పన పనులు శరవేగంగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం జిల్లాలోని 13 కేజీబీవీలలో అభివృద్ధి పనులకు రూ.21.52 కోట్ల నిధులు మంజూరు చేయడంతో ప్రస్తుతం ఆ పనులు జోరుగా జరుగుతున్నాయి. ఈ నిర్మాణ పనులు పూర్తయితే విద్యార్థినుల కష్టాలు తీరతాయి.



మాకవరపాలెంలో నిర్మాణంలో వున్న కేజీబీవీ అదనపు తరగతి గదుల భవనం

గత వైసీపీ ప్రభుత్వం 2022-23 విద్యా సంవత్సరంలో 13 కేజీబీవీలలో అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, మౌలిక సదుపాయాల కోసం నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించినా బిల్లులు విడుదల చేయలేదు. దీంతో కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో చాలా చోట్ల పనులకు శంకుస్థాపన కూడా జరగలేదు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కేజీబీవీల్లో మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించి పనులు చేపడుతోంది. సమగ్ర శిక్ష ఇంజనీరింగ్ విభాగం ద్వారా జిల్లాలో 13 కేజీబీవీలలో అదనపు తరగతి గదుల సముదాయాలు, మౌలిక వసతుల కోసం రూ.21.52 కోట్లతో పనులు చేపడుతున్నారు. ప్రతి కేజీబీవీకి మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయడమే కాకుండా ఇప్పటికే ప్రతి భవనానికి రూ.75 లక్షల నుంచి రూ.9 కోట్ల వరకు నిధులను సమగ్ర శిక్ష ఇంజనీరింగ్ అధికారులకు విడుదల చేశారు. అచ్యుతాపురం, బుచ్చెయ్యపేటల్లో నిర్మాణంలో వున్న కేజీబీవీ అదనపు భవన ... మిగతా 8వ పేజీలో

తప్పిన పెను ప్రమాదం

యాసిడ్ ట్యాంకర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

- చెలరేగిన మంటలు, పొగలు
- సకాలంలో అదుపు చేయడంతో ఊపిరి పీల్చుకున్న జనం



దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు ముందు భాగం

నక్కపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

మండలంలోని వేంపాడు హైవే టోల్‌ప్లాజా వద్ద శనివారం పెను ప్రమాదం తప్పింది. విశాఖ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళుతున్న యాసిడ్ ట్యాంకర్ బ్రేక్ డౌన్ కావడంతో వేంపాడు హైవే టోల్‌ప్లాజా సమీపాన ఆగిపోయింది. అదే రూటులో వెళుతున్న ఆర్టీసీ ఇంద్ర బస్సు శనివారం అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో ఆ ట్యాంకర్‌ను ఢీకొంది. దీంతో ట్యాంకర్ నుంచి యాసిడ్ లీకవ్వడంతో పెద్ద ఎత్తున పొగలు, మంటలు వ్యాపించాయి. స్థానికులు, పలువురు వాహన చోదకులు భయాందోళనకు గురయ్యారు. సుమారు అర్ధ గంట సేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. యాసిడ్ ట్యాంకర్ దగ్ధమవుతుందని అందరూ భయపడిన తరుణంలో ... మిగతా 8వ పేజీలో



ట్యాంకర్ నుంచి పొగలు వ్యాపిస్తున్న దృశ్యం

గోవాడ చెరకు రైతుల ఆందోళన బాట

బకాయిలు చెల్లించాలని, మహాజన సభ నిర్వహించాలని డిమాండ్

- నేడు అన్ని సచివాలయాలకు వినతి పత్రాలు అందజేయాలని నిర్ణయం

చోడవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ క్రషింగ్ సీజన్ కొనసాగింపు ప్రశ్నార్థకంగా మారడంతో గత రెండు సీజన్లకు సంబంధించి రావలసిన బకాయిల కోసం గ్రామ స్థాయిలో చెరకు రైతులు ఆందోళన కొనసాగించాలని నిర్ణయించారు. ఈ నెల 22న అన్ని సచివాలయాలకు గోవాడ చెరకు రైతుల బకాయిలు చెల్లించాలని, మహాజన సభ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రాలు అందజేయాలని రైతు సంఘాలతో కూడిన గోవాడ షుగర్ ఫ్యాక్టరీ పరిరక్షణ సమితి సభ్యులు పిలుపునిచ్చారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ ఈ ఏడాది క్రషింగ్ ప్రారంభించాలని రైతులు, కార్మికులు డిమాండ్ చేస్తున్నా ఇప్పటి వరకు ప్రభుత్వ పరంగా ఏ విధమైన సానుకూల స్పందన రాకపోవడంతో ఫ్యాక్టరీ క్రషింగ్‌పై సందేహాలు తలెత్తాయి. ఇదే సమయంలో గోవాడ పరిధిలో రైతులు పండించిన చెరకును కూడా పొరుగు జిల్లా ఫ్యాక్టరీకి తరలించాలన్న నిర్ణయానికి ఉన్నతాధికారులు రావడంతో ఈ ఏడాది గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో క్రషింగ్ ఉండబోదన్నది దాదాపుగా తేలిపోయింది. ఈ నేపథ్యంలోనే గోవాడ ఫ్యాక్టరీకి సరఫరా చేసిన చెరకుకు సంబంధించి రైతులకు చెల్లించవలసిన బకాయిలు సంగతేమిటన్న వాదన రైతాంగం నుంచి వినిపిస్తున్నది. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ కావడం, పంట పెట్టుబడులకు డబ్బులు అవసరం అవుతుండడంతో బకాయిలు చెల్లించాలని రైతులు పట్టుబడుతున్నారు. ఫ్యాక్టరీలో 2023-24, 2024-25 సీజన్‌లకు సంబంధించిన రూ.28 కోట్లు రైతులకు చెల్లించవలసి ఉంది. ఇవికాక రెండు సీజన్ల రవాణా చార్జీలు మరో కోటి రూపాయలు ఉన్నాయి. మొత్తం రూ.29 కోట్లు రైతులకు చెల్లించవలసి ఉంది. అంతేకాకుండా కార్మికులకు వేతనాలు, రిటైరైన కార్మికులకు పదవీ విరమణ ప్రయోజనాలు కలిపి మరో రూ.7 కోట్లు వరకు చెల్లించవలసి ఉంది. రైతాంగం ఈ బకాయిల చెల్లింపులకు వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఫ్యాక్టరీ వద్ద ఉన్న పంచదార, మొలాసిస్ విక్రయించినా రూ.10 కోట్లకు మించి వచ్చే అవకాశం లేకపోవడంతో, ఫ్యాక్టరీ అధికారులు రైతుల చెల్లింపుల కోసం ప్రభుత్వ సాయం కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే చెరకు రైతులు, కార్మికుల బకాయిలకు సంబంధించి రూ.40 కోట్లతో పాటు గోవాడ షుగర్ ఫ్యాక్టరీ నడిపించేందుకు మరో రూ.30 కోట్లు అవసరమని కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఈ నివేదిక ప్రస్తుతం ప్రభుత్వ పరిశీలనలో ఉంది. ప్రస్తుతం అమరావతిలో ఉన్న ఈ ఫైలుకు సీఎం నుంచి ఆమోదం లభిస్తే, చెరకు రైతుల బకాయిలతో పాటు గోవాడ ఫ్యాక్టరీ నిర్వహణపై క్లారిటీ వచ్చే అవకాశాలు ఉన్నాయి.



గోవాడ షుగర్ ఫ్యాక్టరీ

మహాజన సభ వాయిదా?

గోవాడ షుగర్ ఫ్యాక్టరీ భవితవ్యంతో పాటు రైతులు, కార్మికుల సమస్యలు, బకాయిలపై చర్చించేందుకు మహాజన సభలో అవకాశం ఉంది. ఏటా సెప్టెంబరు నెల 30వ తేదీలోగా గోవాడ ఫ్యాక్టరీ మహాసభ నిర్వహించవలసి ఉంది. ఫ్యాక్టరీ చైర్మన్, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొని ఫ్యాక్టరీ స్థితిగతులపై చర్చించేందుకు వీలుంటుంది. కానీ గోవాడ చెరకు రైతుల బకాయిలకు సంబంధించి ఇప్పటి వరకు ప్రభుత్వపరంగా నిధులు వస్తాయనే సూచనలు లేకపోవడంతో ఈ ఏడాది గోవాడ మహాజన సభ కూడా లేనట్టుగానే కనిపిస్తోంది. ప్రభుత్వపరంగా రైతుల బకాయిలకు సంబంధించి స్పష్టమైన హామీ రాని పక్షంలో మహాజన సభ నిర్వహణ దాదాపుగా లేనట్టేనని ఫ్యాక్టరీ వర్గాల ... మిగతా 8వ పేజీలో

తగ్గనున్న విశాఖ డెయిరీ పాల ఉత్పత్తుల ధరలు

జీఎస్టీ సంస్కరణల ప్రభావం

- నేటి నుంచి అమల్లోకి...

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) :



విశాఖ డెయిరీ ఉత్పత్తులు

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ సంస్కరణలు సోమవారం నుంచి అమల్లోకి రానుండడంతో విశాఖ డెయిరీ పాల ఉత్పత్తుల ధరలు తగ్గనున్నాయి. డెయిరీకి చెందిన పలు ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గుతుండడంతో వాటి ధరలను తగ్గించామని డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డెయిరీ ఉత్పత్తి చేసే యూహెచ్‌టీ టోన్డ్ మిల్క్ లీటర్ ప్రస్తుతం రూ.69 ఉండగా ఇది రూ.66కు తగ్గనుంది. యూహెచ్‌టీ స్టాండర్డ్ మిల్క్ లీటర్ రూ.75 నుంచి రూ.72కు, ఆవు నెయ్యి 500 గ్రాములు రూ.330 నుంచి రూ.309కు, కేజీ రూ.650 నుంచి రూ.608కు తగ్గుతాయి. పన్నీర్ 200 గ్రాములు రూ.90 నుంచి రూ.86కు, కేజీ పన్నీరు రూ.420 నుంచి రూ.400కు, మిల్క్‌షేక్‌లు రూ.25 నుంచి రూ.24, ప్లమ్ కేక్ 100 గ్రాములు రూ.30 నుంచి రూ.27కు తగ్గనుంది. ఈ ధరలు సోమవారం నుంచి అమల్లోకి వస్తాయని చైర్మన్ వివరించారు.

ఆగని ఇసుక దోపిడీ

రాత్రి వేళల్లో సముద్ర తీరం వెంబడి తవ్వకాలు

- నదులు, గెడ్డల నుంచి తీసుకు వచ్చిన ఇసుకలో కలిపేసి అమ్మకాలు
- వాడనర్సాపురంలో అనధికార వేలం పాట నిర్వహించి దందా
- పట్టించుకోని అధికారులు

రాంబిల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

సముద్ర తీరం వెంబడి ఇసుక అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. మండలంలోని వాడపాలెం, లోవపాలెం, సీతపాలెం, కొత్తపట్నం, వాడనర్సాపురం సముద్ర తీరం వెంబడి ఇసుక తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. వాడనర్సాపురం గ్రామంలో అనధికార వేలం పాట నిర్వహించి ఇసుకను తరలిస్తున్నట్టు గ్రామస్థులు చెబుతున్నారు. సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

సముద్ర తీరం వద్ద దారులు ఏర్పాటు చేసుకుని రాత్రి వేళల్లో ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. ఈ ఇసుకను నదులు, గెడ్డల నుంచి తీసుకువచ్చిన ఇసుకలో కలిపి విక్రయాలు చేపడుతున్నారు. దూరాన్ని బట్టి ట్రాక్టర్ ఇసుకను రూ.3 వేలు నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తున్నట్టు తెలిసింది.



వాడనర్సాపురం తీరం వద్ద ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్న రెవెన్యూ సిబ్బంది



వాడనర్సాపురం సముద్ర తీరం వద్ద ఇసుక తవ్విన ఆనవాళ్లు

కలెక్టర్, ఎస్పీకి గ్రామస్థుల ఫిర్యాదు

మండలంలోని వాడనర్సాపురం సముద్ర తీరంలో పలువురు నాయకులు సముద్ర ఇసుకకు అనధికార వేలం పాట నిర్వహించి తవ్వకాలు సాగిస్తున్నట్టు కలెక్టర్, ఎస్పీ, అనకాపల్లి ఆర్డీవో, రాంబిల్లి తహశీల్దార్, రాంబిల్లి సీఐకి గ్రామస్థులు ఇటీవల ఫిర్యాదు చేశారు. ఏడాదికి రూ.3 లక్షలు చొప్పున ఇసుకకు వేలం పాట నిర్వహించారని, ఇసుక వేలం పాట పాడుకున్న వ్యక్తికి ఇసుక తరలించేవారు ట్రాక్టర్‌కు రూ.1500 చెల్లించాలని షరతు పెట్టారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. గత నెలలో జరిగిన వినాయక చవితి నుంచి వచ్చే ఏడాది వినాయక చవితి వరకు ఇసుకను అమ్ముకొనేందుకు వేలం పాట నిర్వహించినట్టు వారు తెలిపారు. దీనిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వాడనర్సాపురం సముద్ర తీరంలో ఈ నెల 20వ తేదీ రాత్రి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వీఆర్‌ఏలు చోడిపల్లి అప్పలరాజు, జి.జగ్గారావులు ... మిగతా 8వ పేజీలో

దూర విద్య ఫలితాలెన్నడో?

ఈ ఏడాది మార్చిలో పరీక్షలు నిర్వహించిన ఏయూ

- తాజాగా ప్రారంభమైన మూల్యాంకన ప్రక్రియ
- సుమారు 12 వేల మంది విద్యార్థుల నిరీక్షణ
- ఉన్నత విద్యా కోర్సుల్లో చేరలేకపోతున్నామని ఆవేదన

విశాఖపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):

ఆంధ్ర విశ్వవిద్యాలయం అధికారులు విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనికి నిదర్శనంగా ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన దూరవిద్య పరీక్షల ఫలితాలను ఇప్పటికీ విడుదల చేయకపోవడాన్ని ప్రస్తావిస్తున్నారు. ఫలితాలు వెలువడక ఉన్నత విద్యా కోర్సుల్లో చేరే అవకాశం కోల్పోయామని విద్యార్థులు గగ్గోలు పెడుతున్నారు.

సాధారణంగా పరీక్షలు నిర్వహించిన 25 నుంచి 30 రోజుల్లో ఫలితాలు వెల్లడించాల్సి ఉంది. అందుకు విరుద్ధం గా దూరవిద్య పరీక్షలు జరిగి నెలలు గడుస్తున్నా ఇప్పటికీ ఫలితాలను వెల్లడించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ... మిగతా 8వ పేజీలో





సమావేశంలో మాట్లాడుతున్న అనంతరావు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలి

ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త అనంతరావు

మునగపాక, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త తనకాల అనంతరావు కోరారు. మండలంలో నాగులాపల్లిలో ఆదివారం జరిగిన కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఆదేశాల మేరకు ఓటు చోరీ అంశంపై సంతకాల సేకరణ చేపడతామన్నారు. సమావేశంలో నాయకులు పొలమరశెట్టి ఆదిమూర్తి, ఎంవీఆర్ రాహుల్, రామసత్యం, రవి, మోహన్, సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

పురుషోత్తపురంలో స్వచ్ఛ భారత్



పిచ్చిమొక్కలను తొలగిస్తున్న ఎన్టీఆర్ యూత్ ప్రతినిధులు

ఎలమంచిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం గ్రామంలో ఎన్టీఆర్ యూత్ ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు యువత ముందుకు వస్తుండడం అభినందనీయమని టీడీపీ పార్లమెంటరీ ఉపాధ్యక్షుడు, లక్కవరం పీఏసీఎస్ అధ్యక్షుడు కొలుకులూరి విజయ్‌బాబు అన్నారు. ఆదివారం ఎన్టీఆర్ యూత్ ప్రతినిధులు, సభ్యులు స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా జెడ్పీ హైస్కూల్ పరిసర ప్రాంతాల్లోని చెత్తను తొలగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజయ్‌బాబు, టీడీపీ యూనిట్ ఇన్‌చార్జి రాజాన వెంకునాయుడులు మాట్లాడుతూ టీడీపీ నాయకులందరూ కలిసి సమష్టిగా ప్రతి ఆదివారం సేవా కార్యక్రమాలను చేపడుతుండడంతో గ్రామంలోని పరిసరాలు పరిశుభ్రంగా ఉంటున్నాయన్నారు. కార్యక్రమంలో ఆర్.వెంకునాయుడు, గ్రామ శాఖ అధ్యక్షుడు రెడ్డి నానాజీ, కాళ్ల సత్యనారాయణ, రాజాన సత్యనారాయణ, కార్తీక్, గంగాధర్, దేవుడు, శ్రీను, బొడ్డు రాజు, తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంతో పరిజ్ఞానం

మునగపాక, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత పఠనం ద్వారా మంచి పరిజ్ఞానం లభిస్తుందని వెంకటేశ్వర గీతా ప్రచార సమితి కన్వీనర్ శరగడం పరదేశినాయుడు అన్నారు. మండలంలోని తిమ్మరాజుపేటలో నిర్మాణంలో ఉన్న శ్రీకల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఆదివారం చిన్నారులకు భగవద్గీత పఠనంపై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవతా విలువలు పెరగడమే కాకుండా అజ్ఞానం దరిచేరకుండా పఠనం ఆయుధంగా ఉంటుందన్నారు. ఆలయ నిర్మాణ కర్త శరగడం రామేశ్వరరావు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు

పలుచోట్ల కనకదుర్గమ్మ ప్రతిమలను ప్రతిష్ఠించేందుకు పందిర్ల ఏర్పాటు

అచ్యుతాపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): శరన్నవ రాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానుండడంతో ఆలయాలు ముస్తాబయ్యాయి. ఇందులో భాగంగా హరిపాలెం అందలాపల్లిలో గల భగీరథీ అమ్మవారి ఆలయంలో సోమవారం అధిక సంఖ్యలో భక్తులు భవానీ మాలధారణ చేయనున్నారు. అలాగే హరిహర పంచాయతన క్షేత్రం (సిద్ధాశ్రమం)లోని దుర్గాలయంలో కూడా భవానీ భక్తులు మాలధారణ చేపడతారు. పూడిమడక, అప్పన్నపాలెం, మార్టూరు, తదితర ప్రాంతాల్లో పలు గ్రామల్లో దుర్గాదేవిలను ప్రతిష్ఠించేందుకు పందిర్లను ఏర్పాటు చేశారు.



హరిపాలెం అందలాపల్లిలో వెలసిన భగీరథీ అమ్మవారు

మునగపాక: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా జరిపేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పలుచోట్ల దుర్గాదేవి ప్రతిమలను ప్రతిష్ఠించేందుకు భారీ సెట్టింగ్‌లతో కూడిన మండపాలను సిద్ధం చేశారు. మునగపాక, వాడ్రాపల్లి, ఒంపోలు, ఉమ్మలాడ, నాగులాపల్లి, తిమ్మరాజుపేట, పాటిపల్లి, చూచుకొండ, గణపర్తి, తదితర గ్రామాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేపట్టారు. కాగా అధిక సంఖ్యలో భక్తులు భవానీ మాలధారణ చేయనున్నారు.

రక్తదానానికి అందరూ ముందుకు రావాలి

మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు

ఎలమంచిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రక్తదానం చేసేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు కోరారు. ఆదివారం కోర్టుపేట వద్ద బుజ్జి వెజిటబుల్ దుకాణం వద్ద సంకల్పం స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో గొలుసుపూడి శ్రీనివాస బుజ్జి ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని, మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆపదలో ఉన్నవారికి మనం అందించే రక్తం వారి జీవితంలో వెలుగులు నింపుతుందన్నారు. యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దూళి రంగనాయకులు, అనంతరం ఎంపీపీ బోదెపు గోవింద్‌లు రక్తదాతలను, బుజ్జిని అభినందించారు. రక్తదాతలకు బుజ్జి హెల్మెట్లను ప్రోత్సాహకంగా అందజేశారు. కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొర్లె నానాజీ, పిట్టా శ్రీను, క్లస్టర్ ఇన్‌చార్జ్ కరణం రవి, సీఐ ధనుంజయరావు, తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పప్పల చలపతిరావు, తదితరులు

గురజాడ అప్పారావుకు నివాళి

ఎలమంచిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ అప్పారావు వంటి మహనీయులను యువత ఆదర్శంగా తీసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని స్థానిక గ్రంథాలయాధికారి ఆనంద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురజాడ జయంతిని ఘనంగా నిర్వహించారు. వాకర్స్ క్లబ్ ప్రతినిధులు, సభ్యులు గురజాడ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు మడుగుల సత్యనారాయణ, వాకర్స్ క్లబ్ సభ్యుడు అశోక్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ద్వారకానగర్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మండల కన్వీనర్ సీహెచ్ మంగతాయారు, ఎల్.శ్యామల గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానికులు హైమ, జ్యోతి, లక్ష్మి, మాధవి, నాగమణి, తదితరులు పాల్గొన్నారు.

అచ్యుతాపురం: సంఘ సంస్కర్త, రచయిత గురజాడ అప్పారావు 163వ జయంతిని మోసయ్యపేటలో ఐద్వా ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా గురజాడ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు ఆర్.లక్ష్మి, త్రిమూర్తులమ్మ, కె.కాలసులమ్మ, ఉష, భువన, జోషిక, వర్షిత, రేవంతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నారాయణను కలిసిన 'ప్రగడ'

ఎలమంచిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మునిసిపల్ శాఖ మంత్రి పి.నారాయణను రాష్ట్ర రహదారుల కార్పొరేషన్ సంస్థ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మ మునిసిపాలిటీ అభివద్ధికి సహకరించాలని కోరినట్టు ఆయన పేర్కొన్నారు. తాను మంత్రిని కలిసినప్పుడు పట్టణ తెలుగు యువత అధ్యక్షుడు నమ్మి రమణ తదితరులు ఉన్నారన్నారు.



మంత్రి నారాయణతో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు 'కస్తూర్బా' విద్యార్థినులు

అచ్యుతాపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు తమ విద్యార్థులు ఎంపికైనట్టు కస్తూర్బా పాఠశాల పీడీ దేవరపు బేబీ రాణి తెలిపారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి తైక్వాండ్ పోటీల్లో అండర్-14 విభాగంలో ఆరో తరగతి చదువుతున్న ఎం.దీప్తి, అండర్-17 విభాగంలో పదో తరగతి చదువుతున్న పి.తేజ సత్యశ్రీ, 9వ తరగతి చదువుతున్న డి.దీక్షిత గెలుపొంది రాష్ట్ర స్థాయికి ఎంపికయారన్నారు. వీరిని పాఠశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థినులతో పాఠశాల ప్రతినిధి

స్వదేశీ వస్తువుల వినియోగంపై నేడు ర్యాలీ

ఎలమంచిలి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సోమవారం ఉదయం స్వదేశీ వస్తువులు వినియోగంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు చైర్‌పర్సన్ రమాకుమారి తెలిపారు. ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా పక్షోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం ఉదయం మునిసిపల్ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

అచ్యుతాపురం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి ఎంజేపురంలో సురక్ష హెల్త్ ఫౌండేషన్ సహకారంతో విష్ణు ఆస్పత్రి యాజమాన్యం ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరానికి విచ్చేసిన సుమారు 200 మందికి వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇలా..

ఎట్టకేలకు రోడ్డుకు మోక్షం

వైసీపీ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రహదారి

ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చొరవతో నిర్మాణానికి నోచుకున్న వైనం

మునగపాక, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో మునగపాకలోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే రోడ్డు నిర్లక్ష్యానికి గురైంది. మండల పరిషత్, రెవెన్యూ, పోలీస్ స్టేషన్, వ్యవసాయ, వెలుగు, ఉపాధి కార్యాలయాలకు వెళ్లడానికి ఈ రహదారి ఒకటే మార్గం. అంతటి ప్రాధాన్యం కలిగిన రోడ్డు వర్షం పడినప్పుడల్లా వారం రోజుల వరకు గోతుల్లో నీరు చేరి ఈ మార్గంలో రాకపోకలు సాగించే ఆయా శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గరయ్యేవారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అప్పటి ఎమ్మెల్యే కన్నబాబురాజు మండల పరిషత్ సర్వసభ్య సమావేశాలకు, ఉపాధి పథకం సోషల్ ఆడిట్, ఆగస్టు 15న జెండా వందనాలకు అనేక పర్యాయాలు ఈ మార్గం గుండా విచ్చేసినా రోడ్డు నిర్మాణంపై మాత్రం చొరవ చూపలేదు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో నూరుశాతం ఫలితాలను వైసీపీ అభ్యర్థులు సొంతం చేసుకున్నా వారు కూడా ఈ రోడ్డు గురించి పట్టించుకోలేదు. అలాగే ఇతర ప్రజాప్రతినిధులు రహదారి బాగుపై ఏ మాత్రం దృష్టి సారించలేదు. కాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రోడ్డుకు మోక్షం లభించింది. రెండు నెలలు క్రితం ఈ రోడ్డు మార్గం గుండా ఉపాధి హామీ పథకం ఆధ్వర్యంలో జరిగిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమానికి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు. అప్పుడు ఈ రోడ్డులోని గోతుల్లో వర్షపు నీరు తిష్ట వేయడం చూసిన ఆయన అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. దీంతో అధికార యంత్రాంగం 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.3 లక్షలతో సీసీ రోడ్డు రోడ్డు నిర్మాణాన్ని ఇటీవల పూర్తి చేశారు. ఎమ్మెల్యే విజయకుమార్ చొరవతో రోడ్డుకు మోక్షం లభించిందని స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



వైసీపీ హయాంలో ఇలా..

ఘనంగా మరిడమ్మ జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

పాయకరావుపేట రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదరాంభద్రపురంలో ఆదివారం మరిడమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఆదివారం ఉదయం నుంచి ఆలయాన్ని సందర్శించి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. జాతర మహోత్సవం సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టీడీపీ నాయకులు మజ్జూరి నారాయణరావు, కలిగట్ల శ్రీనివాసరావు, శింగంశెట్టి నాగేశ్వరరావు, గొల్లపల్లి నాగు, ఎల్లంశెట్టి నరసింహమూర్తి, కలిగట్ల మూలాస్వామి, పడాల కోటి తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతియేటా దశమికి ముందు అమ్మవారి జాతర మహోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

పాయకరావుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) :స్థానిక ప్రభుత్వ ఐటీఐలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి వివిధ ట్రేడ్‌లలో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి నాలుగో విడత దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ప్రభుత్వ ఐటీఐలో చేరేందుకు ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 27లోగా విద్యార్హతలతో పాటు అన్ని రకాల ధ్రువ పత్రాలతో పాయకరావుపేటలోని ప్రభుత్వ ఐటీఐకి వచ్చి ఆన్‌లైన్ ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. అలాగే 28న సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తప్పనిసరిగా చేయించుకోవాలని లేకుంటే మెరిట్ లిస్టులో పేరు కనపడదన్నారు. ఈనెల 29న పాయకరావుపేట ప్రభుత్వ ఐటీఐలో కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు ఐటీఐ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

8వ రోజుకు మత్స్యకారుల ఆందోళన



రాజయ్యపేటలో ఆందోళన నిర్వహిస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా మండలంలోని రాజయ్యపేటలో మత్స్యకారులు చేస్తున్న ఆందోళన ఆదివారం నాటికి 8వ రోజుకు చేరుకొంది. బల్క్‌డ్రగ్ పార్కు వల్ల తమ ప్రాంతాలు, జీవితాలు నాశనమవుతాయని, సముద్రం నుంచి తమరిని దూరం చేయడం చాలా దుర్మార్గమని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బల్క్‌డ్రగ్ పార్కును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్లకార్డులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు పి.తాతీలు, ఎరుపల్లి నాగేశ్, పిక్కిస్వామి,పి.రాంబాబు, డి.నానాజీ, సోమేశ్, స్వామి, బైరాగి రాజు, మాధవరావు, రాంచరణ్ తదితరులు పాల్గొన్నారు.

నవయుగ వైతాళికుడికి ఘన నివాళి

» ఎస్.రాయవరంలో గురజాడకు పలువురి నివాళి » సాహితీ సేవలు, సంఘ సంస్కరణలను స్మరించుకున్న నేతలు, అధికారులు

ఎస్.రాయవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : నవయుగ వైతాళికుడు, సంఘ సంస్కర్త గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఆదివారం పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. గురజాడ జన్మస్థలమైన మండల కేంద్రం ఎస్.రాయవరంలో గురజాడ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ వేడుకలను చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలో ఉన్న గురజాడ అప్పారావు కాంస్య విగ్రహానికి ఎంపీపీ కేసు బోయిన వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం, ఎస్ఐ విభీషణరావుతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు మాట్లాడుతూ 'దేశమును ప్రేమించుమన్న మంచి అన్నది పెంచమన్న, దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్' అని ఎలుగెత్తి చాటిన నవయుగ వైతాళికుడు గురజాడ అప్పారావు అని కొనియాడారు. 'కన్యాశుల్కం' వంటి గొప్ప నాటకం ద్వారా సాంఘిక దురాచారాలను ఎదిరించడంతో పాటు కుల, మత, వర్గ విభేదాలను రూపుమాపేందుకు ఎంతో కృషి చేసిన గొప్ప సంస్కర్త గురజాడ అప్పారావు అన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఈ గ్రామంలో సాయంత్రం నుంచి కోలాటంతో పాటు రాత్రికి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ భూపతి అప్పారావు, గురజాడ ఫౌండేషన్ అధ్యక్షుడు కర్రి వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కందుల వెంకటేశ్వరరావు, మాజీ వైస్ ఎంపీపీ కొణతాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



ఎస్.రాయవరంలో గురజాడ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు తదితర నేతలు

నక్కపల్లిలో..

నక్కపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సీతంపాలెంలో ఆదివారం నవయుగ వైతాళికుడు గురజాడ వెంకట అప్పారావు జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష, సాహిత్యానికి గురజాడ చేసిన సేవలను వివరించారు. మూఢనమ్మకాలను ప్రజలు వీడేలా వారిలో సామాజిక స్పృహ కలిగించిన సంఘ సంస్కర్తగా గురజాడ పేరు చరిత్రలోనిలిచిపోయిందన్నారు. ఆయన 'కన్యాశుల్కం' నాటకం అజరామరంగా నిలిచిపోయిందన్నారు.ఈ సందర్భంగా పలువురు టెన్త్ విద్యార్థినులకు తన సొంత ఖర్చులతో ఆచార్యులు మాస్టారు మెటీరియల్ అందజేశారు.



నక్కపల్లి : విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఆచార్యులు మాస్టారు

50 పడకల ఆస్పత్రికి ముగ్గురు డాక్టర్ల నియామకం

కోటవురట్ల, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల నిర్వహించిన బదిలీలో భాగంగా కోటవురట్ల వైద్యవిధాన పరిషత్ 50 పడకల ఆస్పత్రికి కొత్తగా ముగ్గురు డాక్టర్లు నిమిమితులయ్యారు. ఈ ఆస్పత్రిలో గత నాలుగేళ్ల నుంచి ఖాళీగా ఉన్న జనరల్ సర్జన్ డాక్టర్ పోస్టు భర్తీ అయింది. విశాఖపట్నం నుంచి జనరల్ సర్జర్ డాక్టర్ ఎన్.రవికిరణ్ కోటవురట్ల ఆస్పత్రికి బదిలీపై వచ్చారు. ఈ నేపథ్యంలో ఈ ఆస్పత్రిలో పని చేస్తున్న చంటిపిల్లల డాక్టర్ గోదాదేవి నర్సీప ట్నం ఏరియా ఆస్పత్రికి పదోన్నతిపై వెళ్లారు. ఆమె స్థానంలో కాకినాడ జిల్లా తుని ఆస్పత్రి నుంచి పీడియాట్రిషియన్ డాక్టర్ రవికుమార్ కోటవురట్ల ఆస్పత్రికి బదిలీ వచ్చారు. ఎంబీబీఎస్ డాక్టర్ భారతి కొత్త పోసింగ్‌పై న్యూ జాయినింగ్ అయ్యారు. మరో ఎంబీబీఎస్ డాక్టర్ జయరాజ్ బదిలీపై వచ్చారు. అయితే ఆయన అనారోగ్యకరంగా సెలవుల్లో ఉన్నట్టు తెలిసింది. కోటవురట్ల ఆస్పత్రిలో 12 మంది డాక్టర్లు ఇప్పటి వరకూ 11 మంది వైద్యులను ప్రభుత్వ నియమించింది. ఇంకా జనరల్ మెడిసిన్ డాక్టర్ పోస్టు భర్తీ కావాల్సి ఉందని సూరింటెండెంట్ డాక్టర్ ప్రసాద్ తెలిపారు.

'పేట' లే అవుట్లపై హోం మంత్రి అనిత ఆరా

పాయకరావుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత పాయకరావుపేటలో అక్రమ లేఅవుట్లపై స్థానిక టీడీపీ నాయకులతో చర్చించారు. శుక్రవారం విజయవాడలోని హోంమంత్రిని కలిసిన పాయకరావుపేట టీడీపీ నాయకుల నుంచి గత కొద్ది రోజులుగా పాయకరావుపేటలో లే అవుట్లకు సంబంధించి జరుగుతున్న పరిణామాలు, అధికారులు చేపడుతున్న కార్యక్రమాలపై ఆరా తీశారని తెలుస్తోంది. ముఖ్యంగా లే అవుట్లలో పంచాయతీకి కేటాయించిన స్థలాలను క్రయవిక్రయాలు జరపడం తదితర అంశాలపై చర్చించారని, వీటిపై ప్రతిపక్ష నాయకులు పార్టీపై బురదచల్లే ప్రయత్నం చేస్తున్నాయని, దీనివల్ల పార్టీ ప్రతిష్ఠ దెబ్బ తీసే అవకాశం ఉన్నందున వాస్తవాలు ప్రజలకు తెలియజేసి నిజాయితీని రుజువుచేసుకోవాల్సిన అవసరం ఉందని నాయకులకు సూచించినట్టు తెలిసింది. లేఅవుట్లపై విజిలెన్స్ విచారణ వేస్తున్న విషయాన్ని మరోమారు నాయకులకు తెలిపారని సమాచారం.

కారు, బైక్ ఢీ : ఒకరికి గాయాలు

పాయకరావుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని పీఎల్ పురం జంక్షన్ వద్ద ఆదివారం కారు, బైకు ఢీకొన్న సంఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. నక్కపల్లి నుంచి పీఎల్ పురం వైపు ఆదివారం సాయంత్రం వస్తున్న బైక్, అలాగే తుని నుంచి నక్కపల్లి వైపు వెళుతున్న కారు మండలంలోని పీఎల్‌పురం జంక్షన్ వద్ద ఢీకొన్నాయి. ఈ సంఘటనలో బైక్ నడుపుతున్న వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. కారు జాతీయ రహదారి పక్కన నుంచి నీటి గుంతలోకి దూసుకెళ్లింది. కారులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా ప్రమాదం నుంచి బయటపడ్డారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ జి.అప్పన్న తెలిపారు.



కాలువలోకి దూసుకెళ్లిన కారు

రోడ్డు అధ్వానం.... ప్రయాణం నరకం



చెరువును తలపిస్తున్న రహదారి

రాంబిల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అప్పారాయుడుపాలెం రోడ్డు అధ్వానంగా ఉండడంతో ప్రజలు నరకం చూస్తున్నారు. జంగాలపాలెం జంక్షన్ నుంచి అప్పారాయుడుపాలెం వెళ్ళే రోడ్డు శిథిలమవడంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ రహదారి ధ్వంసమై, అడుగడుగునా గోతులమయం కావడంతో చినుకుపడితే రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా మారిన గొయ్యిలు చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఈ రోడ్డులో నిత్యం వాహనాలతో రాకపోకలు సాగించే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల రెండు రోజుల పాటు భారీగా వర్షాలు కురవడంతో గోతులమయమైన ఈ రోడ్డు చెరువును తలపించే విధంగా తయారవడంతో ఈ రోడ్డులో ప్రయాణాలు సాగించే వాహనదారులు, పాదాచారులు పడరాని కష్టాలు పడుతున్నారు. ఏళ్ల తరబడి శిథిలావస్థలో ఉన్న ఈ రోడ్డులో కొత్తరోడ్డు వేసేందుకు ప్రభుత్వం నిధులు కూడా మంజూరు చేసిందని, నెలలు గడుస్తున్నా ఎటువంటి రోడ్డు పనులు చేపట్టకపోవడంతో మరింతగా ఇబ్బంది పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడినప్పుడల్లా ఈ రోడ్డులో ప్రయాణించాలంటే సాహసం చేయాల్సి వస్తోందని, పాలకులు, అధికారులు స్పందించి ఈ రోడ్డు పనులు వేగవంతంగా పూర్తి చేసి రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని పలు గ్రామాలకు చెందిన వాహనదారులు కోరుతున్నారు.

వ్యక్తి ఆత్మహత్య

నర్సీపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్ఐ రమేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. బీసీ కాలనీకి చెందిన గోసరెడ్డి సత్యసాయి, దివ్యశ్రీ నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి నాలుగేళ్ల పాప ఉంది. జీకేవీధి మండల పరిషత్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఔట్ సోర్సింగ్‌లో సత్యసాయి పని చేస్తున్నాడు. శనివారం దివ్యశ్రీ వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి ఆలయానికి వెళ్లింది. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చే సరికి భర్త ఉరి వేసుకొని విగత జీవిగా ఉండడాన్ని గమనించి కన్నీరుమున్నీరుగా విలపించింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అన్ని స్టాప్‌ల వద్ద ఆర్టీసీ బస్సులు నిలపాలి

» పలు గ్రామాల ప్రజల వినతి

రాంబిల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాంబిల్లి మండలంలోని అన్ని బస్టాప్‌ల వద్ద ఆర్టీసీ బస్సులు ఆపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు. విశాఖపట్నం, అనకాపల్లి బస్‌స్టేషన్‌ల నుంచి రాంబిల్లి మండలంలోని వెంకటాపురం మీదుగా రాంబిల్లి పరిసర గ్రామాలకు వచ్చే బస్సులు అన్ని బస్టాపులలో ఆగేవని, గత వారం రోజులుగా కొన్నిబస్టాపులలో మాత్రమే బస్సులు ఆపుతుండడంతో ప్రజలు, కళాశాలలు, పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా మహిళలకు ఉచిత బస్సు పథకం పెట్టినప్పటి నుంచి కొన్ని రోజులు బాగానే ఉన్నా, గత వారం రోజులుగా ఆర్టీసీ డ్రైవర్లు బస్సులు ఆపడం లేదని పలు గ్రామాలకు చెందిన ప్రజలు ఆరోపిస్తున్నారు. ఎప్పుడూ తమ గ్రామాల్లో ఆర్టీసీ బస్సులు ఆపేవారని, ఇప్పుడు కొన్ని బస్టాప్‌ల వద్దే ఆపుతున్నారని అంటున్నారు. అనుమతులు ఉన్న బస్టాప్‌ల వద్దే బస్సులు ఆపుతామని, అనుమతులు లేని స్టాప్‌ల వద్ద బస్సులు ఆపలేమనిఆర్టీసీ సిబ్బంది చెపుతున్నారని అంటున్నారని, ఇలా అయితే తాము ప్రయాణాలు ఎలా సాగించగలమని, కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే తమ పిల్లల పరిస్థితి ఏమిటని పలు గ్రామాల ప్రజలు ఆర్టీసీ అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఉచిత బస్సు పథకం పెట్టి నందుకు సంతోషపడాలా... బస్సులు ఆపనందుకు బాధపడాలో అర్థం కావడం లేదంటున్నారు. ప్రభుత్వ పాలకులు, ఆర్టీసీ అధికారులు స్పందించి గ్రామా ల్లో అన్ని బస్టాప్‌ల వద్ద ఆర్టీసీ బస్సులు ఆపేలా చూడాలని పలు గ్రామాలకు చెందిన ప్రజలు కోరుతున్నారు.

ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే..!



ప్రయాణికులతో రద్దీగా ఉన్న కాంప్లెక్స్

▸▸ అధ్వానంగా ఆర్టీసీ కాంప్లెక్స్ ముఖద్వారం ▸▸ అస్తవ్యస్త డ్రైనేజీ వ్యవస్థతో మురుగు తిష్ట

▸▸ అవస్థలు పడుతున్న ప్రయాణికులు ▸▸ పట్టించుకోని ఉన్నతాధికారులు



అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ ముఖద్వారం పక్కన నాచుపట్టి పురుగులతో దర్శనమిస్తున్న మురుగు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రధాన ముఖద్వారం ప్రాంతం అధ్వానంగా మారింది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో కాలువల్లోంచి వెళ్లాల్సిన నీరు ప్రధాన మార్గం పక్కన ఖాళీ ప్రదేశంలోకి చేరుతోంది. అక్కడ రోజుల తరబడి తిష్ట వేస్తుండడంతో మురుగుగా మారి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో ఆ ప్రాంతమంతా నాచుపట్టి, నీటిపై పురుగులు కనిపిస్తున్నారు. దీనికితోడు అటుగా వెళ్లేవారిని దుర్వాసన ఇబ్బందులకు గురిచేసోంది. ఇన్‌గేటు ప్రారంభంలో వర్షపు నీరు నిలిచిపోతోంది. ప్రయాణికులు కాంప్లెక్స్ లోపలికి ప్రధాన మార్గంతో పాటు వాహనాలు పార్కింగ్ చేసే మార్గం ద్వారా వెళ్తుంటారు. పరిస్థితి అధ్వానంగా మారడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడుతున్నారు. బస్సులను కూడా ప్రస్తుతం అధ్వానంగా ఉన్న నీటి ముందే ఆపి ప్రయాణికులను దింపుతున్నారు. అలా దిగిన ప్రయాణికులు బయటకు రావాలంటే మురుగు ఉన్న ప్రదేశమే ప్రధాన మార్గం. జిల్లా నలుమూలల నుంచి ఎంతో మంది కాంప్లెక్స్‌కు వచ్చి వెళ్తుంటారు. దీంతో నిత్యం రద్దీగా ఉంటుంది. కాంప్లెక్స్ ప్రధాన మార్గంలో మురుగు తిష్ట వేసి ఉండడంతో పలువురు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి ఇక్కడ పరిశుభ్రతకు ప్రాధాన్యం కల్పించాలని అంతా కోరుతున్నారు.



ముఖద్వారం కుడి వైపు దుస్థితి

నూకాంబిక ఆలయంలో భక్తుల సందడి

▸▸ అమావాస్య కావడంతో పెద్ద సంఖ్యలో తరలి రాక

▸▸ బాలాలయంలో పూజల అనంతరం దర్శనాలకు అనుమతి



బాలాలయంలోని అమ్మవారు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత అనకాపల్లి నూకాంబిక ఆలయం ఆదివారం భక్తులతో సందడిగా మారింది. అమావాస్య కావడంతో ఈ రోజున అమ్మవారిని దర్శించుకుంటే మంచిదనే భావనతో పెద్ద సంఖ్యలో కుటుంబాలతో తరలి వచ్చారు. తెల్లవారుజామున అర్చకులు బాలాలయంలోని అమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. దీంతో వీరంతా పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన వారిలో చాలా మంది ఆలయ పరిసరాల్లో వంటలు వండుకుని, అమ్మవారికి నైవేద్యంగా సమర్పించిన అనంతరం ఆరగించారు. ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



అమ్మవారి దర్శనానికి ఆలయంలోని క్యూ లైన్లలో వేచి ఉన్న భక్తులు

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు



జీవామృతం తయారీపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

తుమ్మపాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకోవాలని ప్రకృతి వ్యవసాయ మార్కెటింగ్ ట్రైనర్ సిరసపల్లి అప్పలరాజు సూచించారు. తుమ్మపాలలో ఆదివారం ప్రకృతి వ్యవసాయ విధానంపై రైతులకు ఏర్పాటైన అవగాహన కార్యక్రమంలో మాట్లాడారు. వరి పంటకు పదిహేను రోజులకు ఒకసారి జీవామృతం పిచికారీ చేయడం ద్వారా పంట ఏపుగా పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం విధానం వల్ల తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం పొందవచ్చునన్నారు. అలాగే ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వాడడం ద్వారా అనారోగ్య సమస్యలను దూరం చేయవచ్చునని వివరించారు. అనంతరం పొలాల్లో జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది మజ్జి సత్యారావు, మళ్ల నాగేశ్వరరావు, సంతోష్, సాయి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

వీధి వ్యాపారుల కోసం హాకర్స్ జోన్ ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా నాయకుడు వైఎన్ భద్రం

తుమ్మపాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న వారి దుకాణాలను తొలగిస్తుండడం అన్యాయమని సీపీఐ జిల్లా నాయకుడు వైఎన్ భద్రం ఆరోపించారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వ్యాపారులకు ప్రత్యామ్నాయం చూపకుండా అధికారులు ఇలా దుకాణాలు, బడ్డీలను తొలగిస్తుండడం వల్ల వారంతా రోడ్డున పడతారన్నారు. పట్టణంలో హాకర్స్ జోన్ ఏర్పాటు చేసి, వీధి వ్యాపారస్థులకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు తాకాశి వెంకటేశ్వరరావు, కోరిబిల్లి శంకరరావు, శ్రీరామదాసు అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరానికి స్పందన



రక్తదానం చేస్తున్న యువకులతో నాయకులు

సబ్బవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని నిర్వహిస్తున్న పక్షోత్సవాల్లో భాగంగా ఆదివారం సబ్బవరంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు గొంప నరసింగరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో పలువురు యువకులు స్వచ్ఛందంగా వచ్చి రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వనం సత్యనారాయణ, విశాఖ డెయిరీ డైరెక్టర్ శరగడం శంకరరావు, ఎంపీసీ డైరెక్టర్ రెడ్డి రామునాయుడు, మండల స్వామినాయుడు, పెచ్చెట్టి అప్పారావు, గల్లా శ్రీనివాసరావు, స్వామినాథ్, బి. అప్పారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

శంకరం వద్ద వాహనం ఢీకొని జింకకు తీవ్ర గాయాలు

▸▸ విశాఖ జూకు తరలించి చికిత్సలు అందించిన కాసేపటికే మృతి

▸▸ వివరాలు వెల్లడించిన అనకాపల్లి ఫారెస్టు రేంజర్ జ్యోతిర్మయి



జింక మృతదేహానికి జూలో పోస్టుమార్టం నిర్వహిస్తున్న వైద్య బృందం

కొత్తూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం శంకరం వద్ద గల జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ జింక తీవ్ర గాయాలకు గురైంది. చికిత్స నిమిత్తం విశాఖ జూకు తరలించగా, అక్కడ మృతి చెం దినట్టు అనకాపల్లి ఫారెస్టు రేంజర్ జ్యోతిర్మయి తెలిపారు. ఇందుకు సంబంధించి ఆమె కథనం ప్రకారం వివరాలివి. శంకరం వద్ద ఉన్న రెవెన్యూ కొండపై రెండు జింకలు ఉన్నట్టు గ్రామస్థుల ద్వారా ప్రచారంలో ఉండేది. ఆదివారం తెల్లవారు జామున సుమారు 2.30 గంటల ప్రాంతంలో గ్రామస్థులు జిల్లా అటవీ అధికారి శామ్యూల్‌కు గుర్తు తెలియని వాహనం ఢీకొడంతో వన్యప్రాణి జింక తీవ్ర రక్తస్రావంతో పడి ఉందని తెలియజేశారు. వెంటనే ఆయన ఆదేశాల మేరకు పోతుకొండ బీట్ ఆఫీసర్ యాదగిరి ఘటనా స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన జింకను వ్యానులో విశాఖపట్నంలో గల ఇందిరా గాంధీ జూకు తరలించి చికిత్స అందించారు. అయితే కొంత సేపటికే అది మృతి చెందినట్టు ఫారెస్టు రేంజర్ తెలిపారు. అనంతరం దానిని జూలో ఖననం చేశామని ఆమె వివరించారు.



నెహ్రూచౌక్‌లో సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'ఓట్ చోర్'పై కాంగ్రెస్ నేతల సంతకాల సేకరణ

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నెహ్రూచౌక్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు 'ఓట్ చోర్ గద్దె చోడ్'పై ఆదివారం సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ నాయకులు మీసాల సుబ్బన్న మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అనేక పార్లమెంట్, అసెంబ్లీ నియోజకవర్గాల్లో అనేక విధాలుగా దొంగ ఓట్లు చేర్చారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా ఉన్నవారి ఓట్లు తొలగింపునకు గురయ్యాయని తమ పార్టీ అధినేత రాహుల్‌గాంధీ నాలుగు దఫాలు పత్రికా సమావేశం పెట్టి వివరించినా భారత ఎన్నికల కమిషన్ నుంచి ఏ మాత్రం స్పందన రాకపోవడం విచారకరమన్నారు. ఈ పరిస్థితిని చూస్తుంటే ఎన్నికల సంఘం తప్పులకు నిలయంగా మారిందని దేశ ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు. పార్టీ అనకాపల్లి అసెంబ్లీ కో-ఆర్డినేటర్ మలపురెడ్డి కోటేశ్వరరావు మాట్లాడుతూ నిబద్ధత కలిగిన సంస్థ అయిన ఎన్నికల సంఘాన్ని బీజేపీ భ్రష్టు పట్టించిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కాళ్ల సత్యనారాయణ, సేనాపతి రాజు, బోయిన భానుమూర్తి యాదవ్, కత్తెర శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురజాడ అప్పారావు జయంతి



గురజాడ చిత్రపటం వద్ద నివాళులు

కశింకోట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆధునిక తెలుగు సాహిత్యానికి ఒరవడులు దిద్దిన గురజాడ అప్పారావు జయంతిని ఆదివారం ఇక్కడ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా కార్యదర్శి డి.డి.వరలక్ష్మి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవిత చరిత్రను, ఆయన రాసిన కన్యాశుల్కం నాటకం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎం.తారక, ఎం.భాగ్య, కె.లక్ష్మి, నూకరత్నం, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సిఫార్సు లేకుండా యాంటీబయాటిక్స్ విక్రయిస్తే చర్యలు

▸▸ డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్



సదస్సులో మాట్లాడుతున్న డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ్‌కుమార్

కొత్తూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వైద్యుల సిఫార్సు లేకుండా యాంటీ బయాటిక్స్ మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని విశాఖపట్నం డ్రగ్స్ కంట్రోల్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్.విజయ్‌కుమార్ హెచ్చరించారు. అనకాపల్లి పట్టణంలో ఆదివారం ఏర్పాటైన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. డ్రగ్స్ విక్రయాలు చేసేటప్పుడు పాటించాల్సిన అంశాలపై ఫార్మాసిస్టులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కెమిస్టులు, డ్రగ్గిస్టులు నిరంతరం పర్యవేక్షణలో ఉన్నారని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ ఆయా షాపుల్లో రికార్డుల నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ సదస్సులో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు వి.అభిప్రియ, కూన కల్యాణి, ఎం.శ్రీనివాసరావు, ఎస్.కల్యాణి, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు , అనకాపల్లి జిల్లాలకు చెందిన 400 మంది ఫార్మసిస్టులు, కెమిస్టులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

అనకాపల్లి టౌన్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఫుట్‌పాత్‌లపై ఆక్రమణల తొలగింపు ప్రక్రియ ఆదివారం కూడా కొనసాగింది. నెహ్రూచౌక్ నుంచి శారదా నదికి వెళ్లే మార్గంలోని ఫుట్‌పాత్‌లపై ఉన్న బడ్డీలు, ఇతర వ్యాపారాలను జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి, టీపీవో వరప్రసాద్‌ల పర్యవేక్షణలో సిబ్బంది తొలగించారు. ఎప్పుడూ ప్రయాణికులకు ఇబ్బంది కలిగే విధంగా ఉన్న బడ్డీలను తొలగించడంతో ఒక్కసారిగా ఆయా ప్రదేశాలు విశాలంగా మారాయి. అంతేకాకుండా పాత సబ్‌రిజిస్ట్రార్ ఆఫీస్ ముందు ఇష్టానుసారంగా బడ్డీలను ఏర్పాటు చేశారు. వాటిని కూడా అధికారులు దగ్గరుండి తొలగింపజేశారు. పెద్ద బడ్డీలను ఎక్సకవేటర్ సహకారంతో తొలగించి, ప్రత్యేక వాహనం ద్వారా జీవీఎంసీ జోనల్ కార్యాలయంలోని ఖాళీ ప్రదేశానికి తరలించారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చర్యలు తప్పవని కమిషనర్ చక్రవర్తి ఈ సందర్భంగా హెచ్చరించారు.

ఫ్లైయాష్ లోడు లారీ బోల్తా

▸▸ డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలు

▸▸ కేజీహెచ్‌కు తరలింపు



బోల్తా పడిన ఫ్లైయాష్ లోడు లారీ

పరవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఫ్లైయాష్ లోడుతో వెళ్తున్న లారీ శనివారం అర్ధరాత్రి పరవాడ తహశీల్దార్ కార్యాలయం సమీపంలో బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరావి. సింహాద్రి ఎన్టీపీసీకి చెందిన సైలో పాయింట్ నుంచి ఫ్లైయాష్ లోడుతో శనివారం అర్ధరాత్రి లారీ బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో గల ఓ ఇటుకల ఫ్యాక్టరీకి బయలుదేరింది. సరిగ్గా తహశీల్దార్ కార్యాలయం సమీపంలోకి వెళ్లే సరికి అదే రహదారిలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించే క్రమంలో రహదారి పక్కనున్న స్తంభాన్ని ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పెందుర్తి మండలం రాంపురం గ్రామానికి చెందిన డ్రైవర్ డి.సంతోష్, మునగపాక మండలం నారపాక గ్రామానికి చెందిన క్లీనర్ కె.వంశీ తీవ్ర గాయాలకు గురయ్యారు. ఆ సమయంలో అటుగా వెళ్తున్న లారీ డ్రైవర్లు గమనించి, బోల్తా పడిన లారీ క్యాబిన్ నుంచి డ్రైవర్, క్లీనర్‌ను బయటకు లాగారు. క్యాబిన్‌లో ఉన్న జాకీ, ఇతర వస్తువులు వీరిపై పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులకు విశాఖ కేజీహెచ్‌లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. కాగా ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు పాటించని వాహనదారులపై చర్యలు : సీఐ



ఫ్లైయాష్ లోడుతో వెళ్తున్న లారీలను తనిఖీ చేస్తున్న సీఐ మల్లికార్జునరావు

పరవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సింహాద్రి ఎన్టీపీసీ డైక్ నుంచి ఫ్లైయాష్ రవాణా చేస్తున్న లారీల యాజమాన్యాలు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు సూచించారు. ఎన్టీపీసీ నుంచి కలపాక, దేశపాత్రునిపాలెం, లంకెలపాలెం మీదుగా రాకపోకలు సాగిస్తున్న లారీలను ఆదివారం దేశపాత్రునిపాలెం సమీపంలో ఆయన తనిఖీలు నిర్వహించారు. ఫ్లైయాష్ కింద పడకుండా టార్పాలిన్ కట్టుకోవాలని, పరిమితికి మించి లోడు వేయరాదని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించిన కొంతమంది డ్రైవర్లకు జరిమానాలు విధించారు. రాత్రుళ్ల సమయంలో దేశపాత్రునిపాలెం నుంచి గొర్లివానిపాలెం, పరవాడ మీదుగా ఫ్లైయాష్ లారీలు రాకపోకలు సాగించడం నిబంధనలను ఉల్లంఘించడమేనన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ రహదారి గుండా ఇటువంటి లారీలు రాకపోకలు సాగించరాదన్నారు. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా తనిఖీలు మరింత ఎక్కువగా చేపడతామని స్పష్టం చేశారు.

విద్యార్థులను చితకబాదిన సిబ్బంది పై చర్యలు తీసుకోవాలి : ఏఐఎస్ఎఫ్

తుమ్మపాల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులపై అమానుషంగా ప్రవర్తించి, చితకబాదిన గాంధీనగరంలోని ప్రైవేటు స్కూల్ సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జీ డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రోజు రోజుకు ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాల ఆగడాలు మితిమీరిపోతున్నాయని ఆరోపించారు. విద్యను వ్యాపారంగా మార్చేసి ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు పబ్బం గడుపుతున్నాయన్నారు. పర్యవేక్షించాల్సిన విద్యా శాఖాధికారులు కాసులకు కక్కుర్తిపడి పర్యవేక్షణకు పాతర వేస్తున్నారని మండిపడ్డారు. నిర్బంధ విద్య పేరుతో విద్యార్థులను తీవ్రంగా హింసిస్తున్నారన్నారు. తక్షణమే ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా సాగుతున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు జగదీష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

▸▸ నేడు వీధివీధిన కొలువుదీరనున్న అమ్మ ▸▸ ఆలయాల్లో విశేష పూజలు

▸▸ రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్న జగన్మాత



జయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద విద్యుత్ లైటింగ్

అనకాపల్లి టౌన్/ పరవాడ/ సబ్బవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలకు అంతటా ఏర్పాట్లు పూర్తయ్యాయి. అమ్మవారి ఆలయాలు, వీధి వీధిన వేసిన మండపాల్లో ఆదిమాత, అమ్మలగన్న అమ్మ దుర్గాదేవి సోమవారం కొలువుదీరనున్నారు. వచ్చే నెల రెండో తేదీ ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ఆల యాల్లో రోజుకో అవతారంలో జగన్మాత భక్తులకు దర్శనమిస్తారు. ఇందులో భాగంగా అనకాపల్లి పట్టణంలోని విజయరామరాజుపేట అండర్‌బ్రిడ్జి వద్ద గల కనకదుర్గమ్మ ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. సబ్‌వే ప్రారంభం నుంచి రైల్వే అండర్‌బ్రిడ్జి వరకు భారీ ఎత్తున విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. వేల్పులవీధి రజక కాలనీ వద్ద గల కనకదుర్గమ్మ ఆలయం, లక్ష్మీదేవిపేట కనకదుర్గమ్మ ఆలయాల్లో ఈ వేడుకలు మరింత వైభవోపేతంగా జరగనున్నాయి. అలాగే, పట్టణంలోని పలుచోట్ల పెద్ద ఎత్తున మండపాలు ఏర్పాటు చేసి నూతన హంగులకు సెట్‌లు వేశారు. పీలా సోమేష్‌నాయుడు వీధిలో శివశక్తి ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో భారీ సెట్టింగ్‌లు ఏర్పాటు చేశారు. 12 అడుగుల దుర్గామాత విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నామని ఉత్సవ కమిటీ అధ్యక్షులు పీలా రామచంద్రరావు, ఉపాధ్యక్షులు కాండ్రేగుల అప్పలనాయుడు తెలిపారు. ఇదిలావుంటే, పరవాడ బొంకులదిబ్బ యూత్, యంగ్‌మెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉత్సవాలను పోటాపోటీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అలాగే గొర్లివానిపాలెం, తానాం, భరణికం, పెదముషిడివాడ, లంకెలపాలెం, గౌతులచ్చన్ననగర్ కూడలి, దేశపాత్రునిపాలెం, పి.బోనంగి, బొద్దపువానిపాలెం, కలపాక తదితర గ్రామాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. మండపాలతో పాటు ఆయా పరిసరాలు విద్యుద్దీప కాంతులతో ధగధగలాడుతున్నాయి. అలాగే, సబ్బవరంలోని దుర్గామాత ఆలయం శరన్నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబైంది. సోమవారం నుంచి రెండో తేదీ వరకు ఈ వేడుకలు జరగనున్నాయి. ప్రతిరోజూ వివిధ అలంకరణలో అమ్మ దర్శనమివ్వనున్నారని కమిటీ సభ్యులు తెలిపారు.



పరవాడ బొంకులదిబ్బ వీధిలో..



పరమేశ్వరీ పార్కు జంక్షన్‌లో...

బీజేపీ నాయకుల శ్రమదానం



ఆర్అండ్‌బీ కార్యాలయం వద్ద చెత్తను తొలగిస్తున్న బీజేపీ నాయకులు

చింతపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నాయకులు శ్రమదానంతో ఆదివారం స్థానిక ఆర్అండ్‌బీ, ఎక్సైజ్ కార్యాలయాల పరిసరాల్లో చెత్తను తొలగించారు. ఈసందర్భంగా బీజేపీ కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు జైతి ప్రభాకరరావు మాట్లాడుతూ నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు రెండు వరకు సేవా పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు ప్రభుత్వ కార్యాలయాలు, బస్‌స్టాండ్లు, పాఠశాలల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కదుళ్ల శ్రీనివాసరావు, పండ ఈశ్వరరావు, మహేశ్, వనుపరి శ్రీనివాసరావు, మాతే లక్ష్మణరావు, ఉండిగ శివ పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పనులు పరిశీలన



రాజేంద్రపాలెంలో వాటర్ ట్యాంక్ నాణ్యతను పరిశీలిస్తున్న ఈఈ నాగేశ్వరరావు

కొయ్యూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జల్‌జీవన్ మిషన్ పథకంలో తాగునీటి పథకాలు, ఇంటింటికి కుళాయి పనులు నాణ్యత లోపం లేకుండా నిర్మాణం చేపట్టాలని గ్రామీణ నీటి సరఫరా విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి బీవీ నాగేశ్వరరావు సూచించారు. మండలంలో అడాకులలో రూ. 20 లక్షలు, రాజేంద్రపాలెంలో రూ. 32 లక్షలతో నిర్మించిన ట్యాంకుల నిర్మాణాలను పరిశీలించారు. శింగవరంలో రూ 31 లక్షలతో చేపడుతున్న నిర్వహించిన ఇంటింటికి కుళాయి పనులను ఈఈ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు అందించాలని ప్రభుత్వం కోట్లాది రూపాయలతో జల్ జీవన్ మిషన్ పథకంలో రక్షిత పథకాల నిర్మాణాలకు చర్యలు చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఈ కరుణ, జేఈ సాయి, తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ మంజూరు చేయరూ..



పింఛన్ కోసం ఎదురు చూస్తున్న కొర్రా గోర

సీలేరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు దుర్గావీధికి చెందిన చెందిన కొర్రా గోర (70) తనకు పింఛన్ మంజూరు చేయాలని అధికారులను అభ్యర్థిస్తున్నారు. భర్త కొర్రా గానీ ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. అప్పటి వరకు తన భర్తకు ప్రభుత్వం నుంచి పింఛన్ వచ్చేదని ఆమె తెలిపారు. ఈ స్థితిలో తాను వితంతు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నా మంజూరు చేయలేదని ఆమె వాపోతున్నారు. ఇప్పటి వరకు తాను అడవికి వెళ్లి కట్టెలు కుట్టుకుని జీవనోపాధి సాగించానని,ప్రస్తుతం తనకు ఆరోగ్యం బాగోలేక అడవికి వెళ్లలేకపోతున్నానని, ఇప్పటికైనాసంబంధిత అధికారులు స్పందించి తన కు పింఛను మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు.

కిడారి సర్వేశ్వరరావు వర్ధంతి రేపు



కిడారి సర్వేశ్వరరావు

పెదబయలు, సెప్టెంబర్ (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ తండ్రి అరకు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ ప్రభుత్వ విప్ కిడారి సర్వేశ్వరరావు ఏడవ వర్ధంతి ని ఈనెల 23న జిల్లా కేం ద్రం పాడేరులోని కేఎస్ఆర్ ఘాట్ వద్ద నిర్వహించనున్నట్టు టీడీపీ పాడేరు డివిజన్ నాయకుడు పాంగి పాండురంగస్వామి తెలిపారు. ఈ కార్యకర్తలు, అభి మానులు, వివిధ పార్టీల నేతలు, ప్రజలు తరలిరావాలని కోరారు.

గిరిజన ఉద్యోగుల సంఘం సమావేశం 25 తేదీకి మార్పు

పాడేరురూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): పాడేరు గిరిజన భవన్‌లో అఖిల భారత గి రిజన ఉద్యోగుల సంఘం ఈ నెల 21వ తేదీన నిర్వహించాల్సిన సర్వసభ్య సమావేశాన్ని 25వ తేదీకి మార్పు చేసినట్టు జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి, ప్రధాన కార్యదర్శి బోయపల్లి సింహాచలం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కమిటీ కాలపరిమితి పూర్తయిన నేపథ్యంలో ఈ సమావేశం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు



పైప్‌లైన్ లీక్‌ల వద్ద మట్టితో పూడ్చుతున్న జీలుగుపాడు గ్రామస్థులు

అనంతగిరి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిలకలగెడ్డ పంచాయ తీ జీలుగులపాడులో గతకొద్దిరోజులు క్రితం పైపులైను మరమ్మతులకు గురైంది.. దీంతో తాగునీటికి గ్రామంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ స్థితిలో ఆది వారం గ్రామస్థులంతా కలిసి తాగునీటి పథకం మరమ్మతు పనులను పూనుకున్నారు. పైపులైను నుంచి ఎక్కడైతే లీకులు అవుతున్నాయో పరిశీలించి, మట్టితో పూడ్చారు.



పిల్లర్స్‌కే పరిమితమైన మూలపేట పంచాయతీ భవనం



శిథిలమైన పంచాయతీ భవనాన్ని చూపుతున్న సర్పంచ్, వార్డు సభ్యులు

నిధులు పక్కదారి.. నిలిచిన పంచాయతీ భవనం

- మూలపేటలో ఐదేళ్ల కిందట నిధులు మంజూరు..
- అప్పటి పాలక వర్గంపై ఆరోపణలు

కొయ్యూరు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో మూలపేట పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణం గత ఐదేళ్ళుగా అసంపూర్తిగా దర్శనమిస్తోంది. ప్రస్తుతం ఉన్న కార్యాలయ భవనం పూర్తిగా శిథిలం కావడంతో పంచాయతీ కార్యకలాపాలు పరాయి పంచన కొనసాగిస్తున్నారు. అయితే, పంచాయతీ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి మంజూరైన నిధులు పక్కదారి పట్టాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఇటీవల మండలంలో ఐదు పంచాయతీలకు భవన నిర్మాణాలకు వీలుగా నిధులు మంజూరైనా వాటిలో మూలపేట పంచాయతీని చేర్చక పోవటంతో ఆ గ్రామ సర్పంచ్, వార్డు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణాలకు 2018-19 ఆర్థిక సంవత్సరంలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ పథకంలో నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులకు సం బంధించి అప్పటి పాలక వర్గం ఆధ్వర్యంలో నిర్మాణాలు ప్రారంభించారు. అప్పట్లో కేవలం పిల్లర్లు వరకు వేసి, భవన నిర్మాణాన్ని మధ్యలో నిలిపేశారు. నిర్మాణాలకు మంజూరైన నిధులు అప్పటి పర్యవేక్షణ అధికార ఇంజనీరింగ్ సిబ్బంది పాలక వర్గం కుమ్మక్కై పక్కదారి పట్టించారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఇటీ వల పంచాయతీ కార్యాలయ భవన వసతి కల్పించే దిశగా కూటమి ప్రభుత్వం మంజూరైనా వాటిలో మూలపేటను విడిచిపెట్టారన్న మాట వినిపిస్తోంది. ఇప్పటికైనా అధికారులు గతంలో నిధులపై విచారణ జరిపి అసంపూర్తిగా భవ నం నిర్మాణం సమకూర్చే విధంగా చూడాలని సర్పంచ్ రావుల వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు కోరుతున్నారు.

మహిళలకు ప్రత్యేక వైద్య శిబిరాలు

- డీసీహెచ్ఎస్ డాక్టర్ నీలవేణి



చింతపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఏరియా ఆస్పత్రులు, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ ప్రత్యేక వైద్యశిబిరాల్లో భాగంగా మహిళలకు ఆరోగ్య తనిఖీలు నిర్వహిస్తున్నట్టు జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయకర్త (డీసీహెచ్ఎస్) డాక్టర్ ఎం. నీలవేణి తెలిపారు. ఆదివారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం కేంద్ర ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఈనెల 17తేదీ నుంచి అక్టోబరు రెండు వరకు సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రుల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రత్యేక వైద్యనిపుణులు రక్తపోటు, మధుమేహం, ఓరల్, రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు, క్షయపై స్ర్కీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ అభియాన్ ప్రత్యేక వైద్యశిబిరాలు ఈ నెల 22తేదీన అరకులోయ ఏరియా ఆస్పత్రి, 23న చింతపల్లి ఆస్పత్రి, 25న రంపచోడవరం ఆస్పత్రి, 27న కూనవరం సీహెచ్‌సీలో నిర్వహిస్తామన్నారు. ఈ శిబిరాలను మహిళలు, కిశోర బాలికలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్టీలుగా గుర్తించాలని కొండకుమ్మర్ల అభ్యర్థన



జీసీసీ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న కొండకుమ్మరి సంఘ నాయకులు

పాడేరురూరల్, సె ప్టెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): మన్యంలో త రతరాలుగా గిరిజన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలతో జీవనం సాగిస్తున్న కొండకుమ్మర్ల సమస్యలను పరిష్కరించాలని ఆ సంఘ నాయకులు కోరారు. ఈమేరకు ఆది వారం జీసీ సీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్‌ను పాడేరులో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ఏళ్ల తరబడి మ న్యంలో జీవనంసాగిస్తున్న తమను ఎస్టీ నాయికంలుగా ప్రభుత్వం గుర్తించాలని కోరామన్నారు. గిరిజనులమైనప్పటికి గెజిట్‌లో బీసీలుగా నమోదు కావడంతో న్యాయంగా ప్రభుత్వం నుంచి గిరిజన రాయితీలను పొంద లేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన శ్రావణ్‌కుమార్ కొండకుమ్మర్ల సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు.

'కాఫీ బెర్రీ బోరర్ వ్యాప్తిని అరికట్టాలి'



సాడికలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఫ్‌పీవో మేనేజర్ గాంధీ పడాల్

చింతపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): కాఫీ బెర్రీ బోరర్ కిటకం వ్యాప్తిని ప్రాథమిక స్థాయిలోనే అరికట్టాలని మా తోట రైతు ఉత్పత్తిదారుల సంఘం మేనేజర్ కంకిపాటి గాంధీ పడాల్ అన్నారు. ఆదివారం మండలంలోని సాడిక గ్రామంలో ఆదివాసీ రైతులకు కాఫీ బెర్రీ బోరర్ కీటకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్‌పీవో మేనేజర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో తొలిసారిగా ఈకీటకం బయటపడిందన్నారు. ఈ కీటకం కాఫీ గింజ లోపలికి ప్రవేశించి తొలిచివేసి నాశనం చేస్తుందన్నారు. ఫలితంగా కాఫీ దిగుబడి పూర్తిగా దెబ్బతింటుందన్నారు. కాఫీ బెర్రీ బోరర్ అరకులోయ, చింతపల్లి ఉద్యాన పరిశోధన స్థానంలో మాత్రమే కనిపించిందన్నారు. ఇతర ప్రాంతాల్లో ఎక్కడా ఈ కీటకం ఉనికి కనిపించలేదన్నారు. ఈ కీటకం కలిగించే నష్టాన్ని గుర్తించి ముందుగా చింతపల్లి, జీకే వీధి మండలాల గిరిజన గ్రామాల్లో మాతోట ఎఫ్‌పీవో ద్వారా రైతులకు అవతాహన కల్పిస్తున్నామన్నారు. ఈఏడాది కాఫీ గింజలకు అంతర్జాతీయ ధరలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌పీవో సీఈవో చిన్నారావు పాల్గొన్నారు.

ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 21, (ఆంధ్రజ్యోతి): ముంచంగిపుట్టు ప్రెస్‌క్లబ్ నూతన మండల కమిటీ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా బి.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షులుగా పిడిమి విజయవెంకట్, ఉపాధ్యక్షులుగా కూడా మోహన్, కార్యదర్శిగా రెయ్యాల నాగభూషణం, కోశాధికారిగా గంపరాయి కోటిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.సభ్యులుగా బి.ప్రసాదరావు,కాంతారు మోహన్, వి.పదయ్‌కుమార్, సర్ని సురేశ్, ఎస్.శంకర్‌రావు, పి.భాస్కరరావు. కె.అనిల్, కె.రాంబాబు, పి.పులిరాజు, కె.ఈశ్వర్ తదితరులు నియమితులయ్యారు. ప్రెస్‌క్లబ్ బలోపేతానికి కృషి చేస్తామని నూతన కమిటీ పేర్కొంది.

గూడెం గ్రామానికి సౌకర్యాలు కల్పించాలి

మాజీ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ లేఖ

అనంతగిరి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపల్లి పంచాయతీ గూడెం గ్రామానికి మౌలికవసతులు కల్పించాలని మాజీ ఐఏఎస్ అధికారి ఈఏఎస్ శర్మ జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు ఆదివారం లేఖ రాశారు. గ్రామంలో సుమారు 20 కుటుంబాలకు చెందిన గిరిజనులు జీవిస్తున్నారని, స్వాతంత్ర్యం వచ్చి 79పైబడినా ఈ గ్రామానికి విద్యుత్ సౌకర్యం కల్పించలేదని పేర్కొన్నారు. రోడ్డు సౌకర్యం అంతంతమాత్రంగా ఉందని తెలిపారు.. ఐటీడీఏ పీవో గ్రామాన్ని సందర్శించి, సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు.

అలంకారప్రాయంగా ఎస్‌బీఐ ఏటీఎం సెంటర్



మూసివేసి ఉన్న ముంచంగిపుట్టులో ఏటీఎం

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 21 (ఆం ధ్ర జ్యోతి): స్థానిక స్టేట్‌బ్యాంక్ (ఎస్‌బీఐ) ఏటీఎం సెంటర్ అలంకార ప్రాయంగా మారింది. సుమారు మూడు నెలలుగా ఈ కేంద్రం తెరుచుకోలేదు. దీంతో వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బ్యాంక్ అధికారులను అడిగితే సాంకేతిక సమస్య అంటూ కుంటి సాకులు చెబుతుంటారని ఖాతాదారులనుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కనీసం శనివారం మండల కేంద్రంలో వారపు సంత రోజు అయినా ఏటీఎం సెంటర్ అందుబాటులో ఉంచడంలేదు. డబ్బులు తీసుకొనేందుకు ఇక్కడికి వచ్చే వినియోగదారులు తీవ్ర నిరాశతో వెనుదిరుగుతున్నారు.వెలువల ఉన్న వినియోగదారుల కేంద్రాల వద్ద డబ్బులు విత్ డ్రా చేస్తే రూ. వెయ్యికి సుమారు రూ.10 నుంచి రూ.20 వరకు సర్వీస్ చార్జీ తీసుకుంటున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఎస్‌బీఐ అధికారులు స్పందించి ఏటీఎం నిత్యం తెరిచి ఉండే విధంగా చూడాలని ఖాతాదారులు డిమాండ్ చేస్తున్నారు.

త్వరలో వినియోగంలోకి: మేనేజర్

దీనిపై ఎస్‌బీఐ మేనేజర్ కె.శ్రీనివాసరావును వివరణ కోరగా.. ఏటీఎం మిషన్ మరమ్మతులపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. నూతన సామగ్రి పంపించారని, త్వరలో ఏటీఎంను వినియోగంలోకి తెస్తామన్నారు. .

కార్మికుల పని గంటలు పెంపు తగదు: సీఐటీయూ



సిఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు

డుంబ్రిగుడ, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): కార్మికుల పని గంటల పెంపుదల నిర్ణయం తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పోతురాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక విలేకరులకు ప్రకటన విడుదల చేశారు. ఎంతో మంది ప్రాణాలు త్యాగం చేసి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం రద్దుకు చట్టం తీసుకువస్తోందన్నారు. ఈ స్థితిలో 10 గంటల పని విధానంతో ఫ్యాక్టరీలు, షాపులు, వివిధ సం స్థల్లో పని చేస్తున్న కార్మికులపై భారం తగదన్నారు. అలా గే, కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కోరారు.

ముమ్మరంగా రాజ్‌మా సాగు పనులు



అనర్బ గ్రామంలో రాజ్‌మా సాగు పనులు చేపడుతున్న గిరిజనులు

జి.మాడుగుల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మన్యంలో రాజ్‌మా సాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఏజెన్సీలో ఏ గ్రామంలో చూసినా గిరిజనులు రాజ్‌మా సాగు పనుల్లో బిజీబిజీగా కనిపిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం రాయితీపై రాజ్‌మా విత్తనాలను అందించింది. దీంతో గిరిజన రైతులు ఊరట చెందుతున్నారు. దళారుల వద్ద ప్రస్తుతం కిలో రాజ్‌మాలు రూ.100లు పలుకుతోంది. ఈ ప్రభావంతో మన్యంలో రాజ్‌మా సాగు ఘననీయంగా తగ్గుముఖం పట్టే అవకాశం ఉండేది. గత ఏడాది వాతావరణ మార్పులతో రాజ్‌మా పంట నష్టాల బారినపడ్డారు. దీనికితోడు గిరి రైతుల వద్ద విత్తనాలు కరువయ్యాయి. ఇదే సమయంలో అదునుగా ప్రభుత్వం రాయితీపై వీటిని పంపిణీ చేయడంతో సాగు విస్తీర్ణం ఈసారి పెరిగిందని చెప్పవచ్చు.

మండలంలో 3,500 ఎకరాల్లో రాజ్‌మా సాగు

మండల వ్యాప్తంగా ఈ ఏడాది 3,500 ఎకరాల్లో రాజ్‌మా సాగు చేపడుతున్నారు. ఇక్కడి భౌగోళిక వాతావరణం రాజ్‌మా పంటకు అనుకూలం కావడంతో అధికదిగుబడికి వస్తోంది. అలాగే, రాజ్‌మా సాగుపై రైతులకు ప్రత్యేకంగా సూచనలు, సలహాలు అందిస్తున్నాం. మందులు, సస్యరక్షణలపై పొలంబడి ద్వారా వివరిస్తున్నాం.

\- కె.వరప్రసాద్, ఏవో జి.మాడుగుల మండలం

చందాలు వేసుకుని గ్రావెల్ రోడ్డు నిర్మాణం



రోడ్డు నిర్మిస్తున్న నిమ్మపాడు గ్రామ ఆదివాసీలు

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి):జీకేవీధి పంచాయతీ నిమ్మపాడు ఆదివాసీలు చందాలు సేకరించుకుని గ్రామానికి గ్రావెల్ రోడ్డు నిర్మించుకుంటున్నారు. గ్రామంలో 20కుటుంబాల ఆదిమజాతి ఆదివాసీలు(పీవీటీజీ) నివాసముంటున్నారు. ప్రధాన రహదారి నుంచి గ్రామానికి కాలిబాట మినహా వాహనాలు ప్రయాణించే మార్గంలేదు. గత వైసీపీ ప్రభుత్వ హయంలో పలుమార్లు స్థానిక ఆదివాసీలు రహదారి నిర్మించాలని పాలకులు, అధికారులకు అర్జీలు పెట్టుకున్నారు. కానీ రోడ్డు నిర్మించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం స్థానిక గిరిజనులకు పక్కా గృహాలను మంజూరు చేసింది. గృహాల నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమ్మెంట్, ఐరన్, చిప్స్ తరలించేందుకు మార్గంలేక ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. ఈ స్థితిలో గ్రామస్థులు ఒక్కొక్క కుటుంబం రూ.3 వేల చొప్పున నిధులు సమీకరించుకుని ఎక్స్‌కవేటర్‌ని ఏర్పాటు చేసుకున్నారు. ఆదివారం ప్రధాన రహదారి నుంచి నిమ్మపాడు వరకు మూడు కిలోమీటర్ల గ్రావెల్ రోడ్డు నిర్మాణ పనులను ఆదివాసీలు ప్రారంభించారు. ఈ రహదారి నిర్మాణం వల్ల రోగులు, గర్భిణుల ను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించే అవకాశం ఉంటుందని, గృహాల నిర్మాణాలు ఇబ్బంది ఉం డదని ఆదివాసీలు చెబుతున్నారు. కాగా తమ గ్రామానికి తారు రోడ్డు నిర్మించాలని ఆదివాసీలు విజ్ఞప్తి చేస్తున్నారు.

నేటి నుంచి కరాటే శిక్షణ



కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ పాండురాజును సన్మానిస్తున్న విద్యార్థినులు

పాడేరురూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): మహిళలు, విద్యార్థినుల ఆత్మరక్షణకు దోహదపడే కరాటే శిక్షణ తరగతులను ఈ నెల 22వ తేదీ నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు మోదకొండమ్మ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్టు పాండు కరాటే అకాడమి ఇంటర్నేషనల్ కోఫూకాన్ కరాటే క్లబ్ చీఫ్ ఇనస్ట్రక్టర్, ఎగ్జామినార్ బాకూరు పాండురాజు తెలిపారు. దసరా సెలవుల నేపథ్యంలో విద్యార్థినులు, మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్‌పై ప్రత్యేక శిక్షణ అందించనున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆదివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పాండురాజును విద్యార్థినులు, మహిళలు సత్కరించారు.

'టీడీపీ నేత లొట్టి రామ్మూర్తి మృతి తీరని లోటు'



రామ్మూర్తి కుటుంబాన్ని పరామర్శిస్తున్న జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్

పెదబయలు, సెప్టెంబర్ 21 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ నాయకుడు లొట్టి త్రినాథ్(చిన్ని) తండ్రి, సీనియర్ నేత రామ్మూర్తి మృతి పార్టీకి తీరని లోటని అరకు పార్లమెంట్ ఇన్‌చార్జి, రాష్ట్ర జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ అన్నారు. అనారోగ్యంతో ఈ నెల 14న రామ్మూర్తి మృతి చెందారు. ఆదివారం ఆయన శ్రావణ్‌కుమార్ కుటుంబాన్ని పరామర్శించారు. 40 సంవత్సరాలుగా రామ్మూర్తి పార్టీ బలోపేతానికి ఎనలేని కృషి చేశారని పేర్కొన్నారు. తాము అండగా ఉంటామని కుటుంబానికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వెచ్చంగి కొండయ్య, డివిజన్ నాయకుడు పాంగి పాండురంగ స్వామి, మండల పీఏసీఎస్ చైర్‌పర్సన్ నరంజి ప్రసాద్, త్రినాథ్, ధనుంజయ్, అబ్దుల్లా, భూషణం, రాజారావు, మహిళ అధ్యక్షురాలు మహేశ్వరి, స్వప్న, నాగరాజు, బాలు, తదితరులు పాల్గొన్నారు

అధ్వానంగా ధనకోట - డి.బంధవలస రోడ్డు

- రాకపోకలకు గిరిజనుల అవస్థలు



గొప్పులవలస కోతకు లోనైన రోడ్డు

అనంతగిరి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదబిడ్డ పంచాయతీ పెదబిడ్డ జంక్షన్ నుంచి ధనకోట మీదుగా గొప్పులవలస, డి.బంధవలస గ్రామాలకు వేసిన గ్రావెల్ రోడ్డు అధ్వానంగా మారింది.. 2016-17లో అప్పటి టీడీపీ ప్రభుత్వంలోని గిరిజన సంక్షేమశాఖ నిధులు రూ.1.5 కోట్లతో ఈ రోడ్డు నిర్మించారు. అయితే, నిర్మాణంలో లోపాలతో ఆయా గ్రామాల గిరిజనులు నాటినుంచి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో నరకం చూస్తున్నారు. గ్రావెల్ అంతా కొట్టుకుపోయి, పెద్ద గుంతలు పడింది. పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని ఆది వాసీ పరిరక్షణ సమితి నాయకులు సోమేల స్వామి, గిరిజనులు వాపోతున్నారు. ఇకనైనా రోడ్డు బాగు చేయాలని అధికారులను కోరుతున్నారు.



పెచ్చులూడి రాళ్లు తేలిన దృశ్యం

యూరియాకు కొరతలేదు: ఏవో

గూడెంకొత్తవీధి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గిరిజన రైతులకు యూరియా కొరతలేదని స్థానిక వ్యవసాయ అధికారి డి. గిరిబాబు అన్నారు. ఆదివారం మైదాన ప్రాంతాల నుంచి వచ్చిన యూరియాను దామనాపల్లి రైతు సేవా కేంద్రానికి తరలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడు తూ ఇప్పటికే మండలానికి 50టన్నుల యూరియా సరఫరా కాగా, ప్రస్తుతం వచ్చిన యూరియా లో దామనాపల్లి, రైతు సేవా కేంద్రాలకు 6 టన్నుల చొప్పున తరలించామన్నారు. మంగళవారం మరో 20 టన్నులు మండలానికి రానున్నట్టు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతిచెందిన కిశోర్

అనంతగిరి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డముకు వ్యూపాయింట్ వద్ద యువకుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. స్థానికుల సమాచారం మేరకు వివరాలివి.. విజయనగరం జిల్లా ఎస్. కోట మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కిశోర్ అనే వ్యక్తి స్కూటీపై అరకువెళ్లి, ఆదివారం తిరుగు ప్రయాణంలో డముకు వ్యూపాయింట్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి లోనై సంఘటనా స్థలంలోనే మృతిచెందారు. స్థానికుల సమాచారంతో ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలువివరాలు తెలియాల్సి ఉంది. మృతుడు కుటుంబ సభ్యుల నుంచి ఫిర్యాదు అందాల్సి ఉంది.



నర్సీపట్నంలో వర్షం కురుస్తున్న దృశ్యం

రెండు మండలాల్లో భారీ వర్షం

▸ గొలుగొండ మండలం శ్రీరాంపురంలో పిడుగుపాటుకు పాడి గేదె, ఆవు మృతి

నర్సీపట్నం అర్బన్/ గొలుగొండ/కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వాతావరణంలో మార్పుల కారణంగా ఆదివారం పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నీరు నిలిచిపోయింది. నర్సీపట్నం మండలం ఓఎల్.పురం, గబ్బాడ, ధర్మసాగరం, వేములపూడి, నర్సీపట్నం తదితర గ్రామాల్లో రోడ్లపై నుంచి వర్షపు నీరు పారడంతో రాకపోకలకు జనం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇదిలావుంటే, గొలుగొండ మండలంలో సాయంత్రం పిడుగుపాటుకు పాడిగేదె, ఆవు మృతి చెందాయి. శ్రీరాంపురం గ్రామంలో పాక వద్ద ఉన్న పాడి గేదె, ఆవు పక్కనే ఉన్న నేరేడు చెట్టుపై పిడుగు పడినట్లు స్థానికులు గుర్తించారు. దీంతో ఆవు, పాడి గేదె మృతి చెందాయని రైతు రాయపురెడ్డి మల్లిబాబు వాపోయాడు. ఈ కారణంగా సుమారు రెండు లక్షల రూపాయల విలువ చేసే పాడి సంపదను కోల్పోయినట్టు కన్నీరుమున్నీరుగా విలపించాడు. అలాగే, ఏఎల్‌పురం, చోద్యం, పాతకృష్ణాదేవిపేట, లింగంపేట, నాగాపురం, కొంగసింగి తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది.



శ్రీరాంపురంలో పిడుగుపాటుకు మృతి చెందిన గేదె, ఆవు

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నర్సీపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎస్ఐ రమేశ్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. బీసీ కాలనీకి చెందిన గోసరెడ్డి సత్యసాయి, దివ్యశ్రీ నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరికి నాలుగేళ్ల పాప ఉంది. జీకేవీధి మండల పరిషత్ కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా ఔట్ సోర్సింగ్‌లో సత్యసాయి పని చేస్తున్నాడు. శనివారం దివ్యశ్రీ వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి ఆలయానికి వెళ్లింది. ఆదివారం ఉదయం ఇంటికి వచ్చే సరికి భర్త ఉరి వేసుకొని విగత జీవిగా ఉండడాన్ని గమనించి కన్నీరుమున్నీరుగా విలపించింది. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఇద్దరం ప్రేమించి పెళ్లి చేసుకున్నామని, కులాంతర వివాహం కావడంతో భర్త తల్లిదండ్రులకు ఇష్టం లేక ఇంటికి రానివ్వలేదని ఆరోపించింది. తమ మధ్య ఎటువంటి గొడవలు లేవని, అన్యోన్యంగా ఉండేవారమని పేర్కొంది. విచారణ జరిపి న్యాయం చేయాలని పోలీసులను కోరింది.

దుర్గమ్మ పూజలకు వేళాయె

▸ నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు ▸ భారీ ఏర్పాట్లు చేపట్టిన నిర్వాహకులు ▸ రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్న ఆదిమాత



నర్సీపట్నం దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు



విద్యుద్దీపాలతో ధగధగలాడుతున్న నర్సీపట్నంలోని శారదానగర్ రోడ్డు



నాతవరం శ్రీశక్తి పంచాయతన ఆలయంలో కనకదుర్గ

నర్సీపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : శరన్నవరాత్రి ఉత్సవాలకు అమ్మవార్ల ఆలయాలతో పాటు వాడవాడలా ఏర్పాటు చేసిన మండపాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఆదిమాత, అమ్మలగన్న అమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. దీంతో ఎటు చూసినా కోలాహల వాతావరణం ఆరంభమైంది. నర్సీపట్నంలోని దుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో ఈ వేడుకలు మరింత ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయంతో పాటు మెయిన్ రోడ్డులో విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో 26వ వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి చేతుల మీదుగా ఉదయం కలశ స్థాపనతో ఉత్సవాలకు అంకురార్పణ జరగనుంది. అక్టోబరు నాలుగో తేదీ వరకు ఇక్కడ ఉత్సవాలు జరుపుతారు. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరీ అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. తర్వాత వరుసగా గాయత్రిదేవి, అన్నపూర్ణదేవి, మహాలక్ష్మీదేవి, లలితా త్రిపురసుందరీ దేవి, మహా చండీదేవి, సరస్వతీదేవి, దుర్గాదేవి, మహిషాసుర మర్దినీ దేవి, రాజరాజేశ్వరిదేవి అవతారంలో అమ్మవారిని అలంకరిస్తారు. రోజుకో రకం ప్రసాదాన్ని నైవేద్యంగా సమర్పించనున్నారు. సహస్ర కుంకుమార్చన, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, చండీ యాగం, సామూహిక లక్ష కుంకుమార్చనకు ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రాంగణంలో దాతల సహాయంలో ప్రతి రోజూ అన్న ప్రసాద వితరణ చేపట్టనున్నారు. నాలుగో తేదీన చండీయాగం నిర్వహించి పూర్ణాహుతి, ఉత్సవ విగ్రహం నిమజ్జనం వంటివి చేపట్టనున్నామని ఆలయ కమిటీ చైర్మన్ జంపన నాగేంద్రరాజు తెలిపారు.

నాతవరంలో...

నాతవరం : మండల కేంద్రం నాతవరంలోని శ్రీశక్తి పంచాయతన ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల రెండో తేదీ వరకు జరగనున్న ఈ వేడుకలకు సంబంధించి భారీ ఏర్పాట్లు చేపట్టినట్టు ఆలయ ధర్మకర్త శెట్టి సతీష్ తెలిపారు. రోజుకో అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమివ్వనున్నారన్నారు. అలాగే ప్రతిరోజూ ఆలయం వద్ద దాతల సహకారంతో భవానీ దీక్షాపరులకు మధ్యాహ్నం, సాయంత్రం భిక్ష, కైంకర్యం ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు చెప్పారు.

సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు శిక్షణ ప్రారంభం



సాఫ్ట్‌బాల్ క్రీడాకారులతో ఎస్ఐ తారకేశ్వరరావు, పీడీలు, నిర్వాహకులు

కృష్ణాదేవిపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం ఏఎల్‌పురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఆదివారం సాఫ్ట్‌బాల్ శిక్షణ ప్రారంభమైంది. అక్టోబరు నాలుగో తేదీ నుంచి మూడు రోజుల పాటు రాష్ట్ర స్థాయి పోటీలు జరగనున్నాయి. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో గల పలువురు క్రీడాకారులకు టోర్నమెంటు ద్వారా ఆటలో మెలకువలపై శిక్షణ ఇస్తున్నారు. గెలుపే లక్ష్యంగా పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నాతవరం ఎస్ఐ వై.తారకేశ్వరరావు, టోర్నమెంట్ కమిటీ చైర్మన్ చిటికెల తారకవేణుగోపాల్, స్కూల్ చైర్మన్ లగుడు రాజులునాయుడు, చిటికెల తేజ, పోతల శ్రీరామ్మూర్తి పీడీలు టీవీ రమణ, నర్సింగరావు, సుమన్, రవి, రాజేశ్‌కుమార్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.

'పంచాయతీకి పయనీర్ కంపెనీ ఆస్తి పన్ను చెల్లించాలి'



కంపెనీ చెల్లించాల్సిన ఆస్తి పన్ను పత్రాలు చూపుతున్న రైతులు

వనాకవరపాలెం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పయనీర్ కంపెనీ గత పదిహేనేళ్లుగా పంచాయతీలకు చెల్లించవలసిన ఆస్తి పన్ను చెల్లించలేదని రాచపల్లి టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జమీందార్ అన్నారు. ఆదివారం గ్రామంలో రైతులతో ఏర్పాటైన సమావేశంలో మాట్లాడారు. కంపెనీకి రాచపల్లి గ్రామం నుంచి సుమారు 1600 ఎకరాల భూమి ఇచ్చామన్నారు. అయితే కంపెనీలో మాత్రం గ్రామం నుంచి 200 మందిని మాత్రమే ప్రైవేటు ఉద్యోగాలుగా కంపెనీ యాజమాన్యం తీసుకుందన్నారు. అలాగే కంపెనీకి ఆనుకొని ఐదు పంచాయతీలకు చెందిన భూములను తీసుకొని నేటి వరకూ పంచాయతీలకు రావలసిన సుమారు రూ.80లక్షల ఆస్తి పన్ను చెల్లించలేదని ఆరోపించారు. దీనిపై అప్పటి నుంచి సమాచారం హక్కు చట్టం కింద దరఖాస్తు చేస్తున్నా నేటికీ పట్టించుకోలేదన్నారు.

అలాగే కంపెనీలో ప్రమాదం జరిగినా కార్మికులను పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే దీనిపై స్పందించక పోతే పంచాయతీలకు రావలసిన ఆస్తి పన్నుపై పోరాటం చేస్తామని హెచ్చరించారు.

గ్రంథాలయంలో ఘనంగా గురజాడ జయంతి



గురజాడ చిత్రపటం వద్ద నివాళులు

నర్సీపట్నం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి శాఖా గ్రంథాలయంలో గురజాడ అప్పారావు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి దమయంతి ఆధ్వర్యంలో పలువురు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుజాడ రాసిన కన్యాశుల్కం నాటిక ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. ఉపాధ్యాయుడు బీఎస్ ప్రసాద్, విశ్రాంత ఎంఈవో అమృతకుమార్, ప్రభాకరరావు పాల్గొన్నారు.

వాహనం ఢీకొని తీవ్ర గాయాలతో జింక మృతి

అనకాపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శంకరం వద్ద గల జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ జింక తీవ్ర గాయాలకు గురైంది. చికిత్స నిమిత్తం విశాఖ జూకు తరలించగా, అక్కడ మృతి చెం దినట్టు అనకాపల్లి ఫారెస్టు రేంజర్ జ్యోతిర్మయి తెలిపారు. ఇందుకు సంబంధించి ఆమె కథనం ప్రకారం వివరాలివి. శంకరం వద్ద ఉన్న రెవెన్యూ కొండపై రెండు జింకలు ఉన్నట్టు గ్రామస్థుల ద్వారా ప్రచారంలో ఉండేది. ఆదివారం తెల్లవారు జామున సుమారు 2.30 గంటల ప్రాంతంలో గ్రామస్థులు జిల్లా అటవీ అధికారి శామ్యూల్‌కు గుర్తు తెలియని వాహనం ఢీకొడంతో వణ్యప్రాణి జింక తీవ్ర రక్తస్రావంతో పడి ఉందని తెలియజేశారు. వెంటనే పోతుకొండ బీట్ ఆఫీసర్ యాదగిరి ఘటనా స్థలానికి చేరుకున్నారు. జింకను వ్యానులో విశాఖలో గల ఇందిరా గాంధీ జూకు తరలించి చికిత్స అందించారు. కొంత సేపటికే అది మృతి చెందినట్టు ఫారెస్టు రేంజర్ తెలిపారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	130.00
లైవ్ ధర	150.00
విత్ స్కిన్	270.00
స్కిన్ లెస్	280.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	540
విజయనగరం	544
శ్రీకాకుళం	544

ఘనంగా మోదమాంబ పండగ



మోదకొండమ్మ



ఘటాలతో మహిళలు

రావికమతం,సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో దొండపూడి గ్రామంలో ఆదివారం మోదమాంబ పండగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఏటా వరి నాట్లు వేసిన అనంతరం పండగ నిర్వహించడం ఆనవాయితీ. గ్రామ శివారు చెక్ పోస్టు వద్ద గల ఈ ఆలయానికి వేకువ జాము నుంచి భక్తులు వెళ్లి అమ్మవారికి పసుపు కుంకుమలు, చీరలు, రవికులతోపాటు వివిధ కానుకలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ముందుగా ఘటాలతో గ్రామం నుంచి ఊరేగింపుగా ఆలయానికి వెళ్లారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు, భారీ బాణ సంచా ఏర్పాటు చేశారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు లయవర్ధన్ ఎంపిక



లయవర్ధన్‌ను అభినందిస్తున్న సభ్యులు

చోడవరం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): స్థానిక గొంతిన లయవర్ధన్ విజయవాడలో ఈనెల 28 నుంచి నిర్వహిస్తున్న జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక ఉషోదయ కాలేజీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో లయవర్ధన్‌ను అభినందించారు. పోటీలకు హాజరయ్యేందుకు అతనికి ఆర్థిక సాయం అందించారు. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో యోగా అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుల్లేటి సతీశ్, ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ రమణాజీ, యోగ శిక్షణ కేంద్రం చైర్మన్ పసుమర్తి అశోక్, స్థానిక ప్రముఖులు డాక్టర్ బంగారు కృష్ణ, రెడ్డి అప్పారావు, కొల్లూరి శ్రీనివాసరావు, కొట్టాపు హరికిరణ్, బి. మోహన్‌కుమార్, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో అవస్థలు



వడ్డాదిలో నిలిచిన వర్షం నీరు

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 21 (ఆంధ్ర జ్యోతి): మండలంలో భారీ వర్షం కురిసింది. వడ్డాది వద్ద బీఎన్ రోడ్డు జలమయమైంది. గోతులు నీటితో నిండిపోయాయి, వాహనదారులు ఇబ్బంది ఎదుర్కొన్నారు. ఆదివారం సంత కావడంతో కురిసిన వర్షంతో వ్యాపారాలు సాగలేదు.

దేవరాపల్లి: మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఉరుములతో కూడిన వర్షం పడింది. ఆదివారం సంత కావడంతో వ్యాపారులు, గ్రామాలనుంచి గిరిజనలు, కొనుగోలుదారులు ఇబ్బంది ఎదుర్కొన్నారు.

కోణాం జలాశయం నుంచి 500 క్యూసెక్కులు విడుదల

చీడికాడ: మండలంలో కోణాం జలాశయం నుంచి 500 క్యూసెక్కుల వరద నీటిని దిగువ గేట్లు ద్వారా నదిలోకి ఆదివారం రాత్రి 9.30 గంటలకు విడుదల చేసినట్టు జలాశయం ఏఈ బీవీ సత్యనారాయణ దొర తెలిపారు. జలాశయం గరిష్ట నీటి మట్టం 101.25 మీటర్లు కాగా, ప్రస్తుతం 99.70 మీటర్లకు చేరుకుందని తెలిపారు. ఇన్‌ఫ్లో 400 క్యూసెక్కులు కాగా, అవుట్ ఫ్లో 500 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని, ఆయన తెలిపారు.

జానకిరాంపురం పీఏసీఎస్ పాలక వర్గం ప్రమాణం



ప్రమాణ స్వీకారం చేస్తున్న చైర్మన్ మహారాజ్, డైరెక్టర్లు



పీవీఎస్ఎన్ రాజు, చైర్మపర్సన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రోలుగుంట, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జానకిరాంపురం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా బలిజి మహారాజ్ ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా సభను ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు పాల్గొన్నారు. చైర్‌పర్సన్‌తో పాటు మరో ఇద్దరు సభ్యులు పరవాడ రాజారావు, గొర్లె శ్రీరామమూర్తి ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతన చైర్‌పర్సన్ మాట్లాడుతూ, రైతులకు పంట రుణాలు సకాలంలో అం దించి వారి ఆర్థికంగా అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ముందుగా జనసైనికులు భారీ ర్యాలీ నిర్వహించారు. బుచ్చెంపేట నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ ఎంకే పట్నం, రత్నంపేట, వడ్డిప, శరభవరం, కొవ్వూరు మీదుగా రోలుగుంట, కొమరవోలు మీదుగా జానకిరాంపురం వరకు సాగింది. 24 పంచాయతీల నుంచి అధిక సంఖ్య లో జనసైనికులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం



వరహామూర్తి దంపతులను సన్మానిస్తున్న మాజీ వీసీ ముత్యాలనాయుడు

చీడికాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులను, గురువులను పూజించిన వారు ఏ రంగంలోనైనా రాణిస్తారని ఆదికవి నన్నయ మాజీ వీసీ మ్రుర్రు ముత్యాలనాయుడు అన్నారు. మండలంలోని వరహాపురం హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడుగా పనిచేసున్న బొడ్డు వరహామూర్తి ఇటీవల జిల్లా స్థాయి అవార్డుకు ఎంపికయ్యారు. వరహామూర్తి దంపతులకు ఆయన సొంత గ్రామం ఎల్‌బీ.పట్నంలో సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడు మాట్లాడుతూ, గ్రామస్థులు, స్నేహితులు, శిష్యులు ఈ సన్మానం ఆనందదాయమని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కుచ్చు కళావతి, సర్పంచ్ బండారు వెంకటలక్ష్మి, టీడీపీ నాయకులు బండారు దేముడునాయుడు, గణేష్, శేషగిరిరావు, కురచా నారాయణమూర్తి, గండి శ్రీను పోతల శ్రీను, విశాఖ డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య నిపుణులు

కె.కోటపాడు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): గురుదేవా చారిటబుల్ ట్రస్ట్, విజయశ్రీ ఉప్పలపాటి మెమోరియల్ క్యాన్సర్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగి న జరిగిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మాజీ సర్పంచ్ డోకల లక్ష్మీ నరసింహమూర్తి ప్రారంభించారు. క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ విజయలక్ష్మి, స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ జ్యోతిర్మయి, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ దిలీప్, కంటి వైద్యులు డాక్టర్ కరణం చంద్రిక పాల్గొని ఈ 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు.క్యాన్సర్ వైద్యులు విజయలక్ష్మి స్త్రీలకు క్యాన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు.

ఆలయ నిర్మాణ పనుల పరిశీలన



వడ్డాదిలో శ్రీ కృష్ణుడి ఆలయం పనులను పరిశీలించిన టీడీపీ నేత తాతయ్యబాబు

బుచ్చెయ్యపేట సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో వడ్డాదిలో శ్రీ కృష్ణుడి ఆలయ నిర్మాణ పనులను టీడీపీ నేత బత్తుల తాతయ్య బాబు పరిశీలించారు. దాతల సహకారంతో ఈ నిర్మాణ పనులను చురుగ్గా సాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మేరకు బత్తుల పరిశీలించారు. ఆలయ కమిటీ కోరిక మేరకు ఆలయ ప్రహరీ నిర్మాణానికి నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. వార్డు సభ్యుడు, టీడీపీ టౌన్ అధ్యక్షుడు దొండా నరేశ్, నాయకులు దొండా రమేశ్, తలారి శంకర్, ఆలయ కమిటీ చైర్మన్ మాలిబాబు తదితరులు పాల్గొన్నారు.

దేవీ నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ



మాడుగులలో ముస్తాబయిన ఆలయం

మాడుగుల, సెప్టెంబర్ 21(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో సోమవారం ఉదయం నుంచి దసరా నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఈమేరకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే దుర్గమ్మ విగ్రహానికి రంగులు వేశారు. సోమవారం అమ్మవారికి ఆభరణాలను అలంకరించి ఉత్సవాలను ప్రారంభిస్తారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం దేవీ ఆడిటోరియం వద్ద 11 రోజులు చేపట్టే కార్యక్రమాలకు సంబంధించి పోస్టర్లను ఆలయ గౌరవ అధ్యక్షులు శ్రీనాధు శ్రీనివాసరావు , దంగేటి సూర్యారావు, ఏఎంసీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు,తదితరులు ఆవిష్కరించారు. 22వ తేదీన రాత్రి శ్రీకృష్ణ రాయభారం, 23న కోలాటం, 24న భజన, 25న దేవీమహత్యం పై ప్రసంగం , 26న కోలాటం, 27న శ్రీగీతాచార్య భక్తి గీతాంజలి, 28న చింటూ ఆర్కెస్ట్రా 29న, ఓల్డ్ ఇన్ గోల్డ్ పాత సినిమా పాటలతో డ్యాన్స్ హంగామా. 30న ఆధ్యాత్మిక కార్యక్రమాలు, దసరా రోజు సత్యహరిశ్చంద్ర పౌరాణిక నాటకం, ఎన్టీఆర్ కళాక్షేత్రం వద్ద డ్యాన్స్ హంగామా, శతకం పట్టు వద్ద రేలారే రేలా జానపద నృత్య ప్రదర్శన లు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ఆర్టీసీ, సివిల్ మోటార్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జరగనున్నాయి.

22 మంది రక్త దానం



శిబిరంలో రక్తదాతలు

దేవరాపల్లి, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ములకలాపల్లి యూత్ ఆధ్వర్యంలో ఆదివారం రక్త దాన శిబిరం నిర్వహించారు. విశాఖ కేజీహెచ్ నేతృత్వంలో 22మంది యువకులు రక్త దానం చేశా రు. సర్పంచ్ గొర్లె అన్నపూర్ణ, కొండలరావు, సహకార సంఘం చైర్మన్ చామంతుల సన్యాసిరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెద్దేరు జలాశయం నుంచి 400 క్యూసెక్కుల విడుదల

మాడుగుల రూరల్, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావిపాలెం పెద్దేరు జలాశయం నీటిమట్టం గరిష్ఠస్థాయికి చేరింది. గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు. కాగా ఆదివారం సాయంత్రానికి 557 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 136.55 మీటర్లకి చేరింది. ఇన్‌ఫ్లో మరింత పెరిగే అవకాశం ఉన్నందున జలాశయం అధికారులు అప్రమత్తమయ్యారు. జలాశయం మూడో గేటు తెరిచి 400 క్యూసెక్కుల నీటిని రాత్రి 8 గంటలకు విడిచి పెడుతున్నట్లు జలాశయం ఏఈ సుధాకర్ రెడ్డి తెలిపారు. జలాశయం పంటకాలువలకు 120 క్యూసెక్కులు విడిచిపెట్టామన్నారు.



ఇంద్రకీలాద్రికి దసరా శోభ

నేటి నుంచి శరన్నవరాత్రి మహోత్సవాలు

- ఈఏడాది 20 లక్షలమంది భక్తులు వస్తారని అంచనా
- 29న దుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం చంద్రబాబు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభంకానున్నాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి స్నపనాది క్రతువు నిర్వహిస్తారు. తొలిరోజు అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిస్తారు. ఉదయం 8-8.30 గంటలకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు. ఈ ఏడాది దేశం నలుమూలల నుంచి ఉత్సవాలకు 20 లక్షల మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేశారు. ప్రొటోకాల్ జాబితాలో ఉన్న వీఐపీల కోసం స్లాట్ విధానాన్ని తీసుకొచ్చారు. ఉదయం 7-9, మధ్యాహ్నం 3-5 గంటల వరకు కల్పిస్తారు. ఈ ఏడాది భక్తుల కోసం 20 లక్షల లడ్డూలను సిద్ధం చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల కారణంగా ఇంద్రకీలాద్రి విద్యుత్ వెలుగుల్లో దేదీప్యమానంగా వెలుగుతోంది. 29వ తేదీ మూలానక్షత్రం రోజున అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిస్తారు. ఆరోజు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు.

విజయవాడలో ట్రాఫిక్ మళ్లింపులు

శరన్నవరాత్రులు ముగిసే వరకు అమలు

విజయవాడ, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై సోమవారం నుంచి ప్రారంభమయ్యే దసరా శరన్నవరాత్రి మహోత్సవాల కారణంగా పోలీసులు ట్రాఫిక్ మళ్లింపులు విధించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి విజయవాడ మీదుగా రాకపోకలు సాగించే భారీ వాహనాలను దారి మళ్లిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు తెలిపారు.

- హైదరాబాద్-విజయవాడ-హైదరాబాద్-విశాఖపట్నం మార్గంలో రాకపోకలు సాగించే భారీ వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్నఅవుటపల్లి వద్ద దిగి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి వాహనాలు చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి నల్లకుంట వద్ద దిగి హైదరాబాద్ మార్గంలోకి వెళ్లాలి.
- హైదరాబాద్ - మచిలీపట్నం-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నల్లకుంట వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కి చిన్న అవుటపల్లి వద్ద దిగాలి. కేసరపల్లి మీదుగా మచిలీపట్నం చేరుకోవాలి. ఇటు నుంచి వెళ్లే వాహనాలు కేసరపల్లి వద్ద నుంచి చిన్నఅవుటపల్లి వద్ద పశ్చిమ బైపాస్ ఎక్కాలి.
- హైదరాబాద్-చెన్నై-హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు నార్కట్‌పల్లి, నల్లగొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, అద్దంకి, మేదరమెట్ల మీదుగా గుంటూరు చేరుకుని అక్కడి నుంచి చెన్నై వెళ్లాలి. చెన్నై నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.
- చెన్నై-విశాఖపట్నం-చెన్నై మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఒంగోలు, త్రోవగుంట, చీరాల, బాపట్ల, రేపల్లె, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ బైపాస్ మీదుగా వెళ్లాలి. విశాఖ నుంచి చెన్నై వెళ్లే వాహనాలు కూడా ఇదే మార్గంలో ప్రయాణించాలి.

నేటి నుంచి శ్రీశైలంలో దసరా మహోత్సవాలు



శ్రీశైలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల క్షేత్రంలో సోమవారం నుంచి దసరా మహోత్సవాలు ప్రారంభం కానున్నాయి. అక్టోబరు 2వ తేదీ వరకు ఈ వేడుకలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి ఆలయ మండపంలో యాగశాల ప్రవేశం చేసి గణపతిపూజ, స్వస్తిపుణ్యాహవచనం, దీక్షా సంకల్పం, కంకణపూజ, కంకణధారణ తదితర పూజలు నిర్వహించనున్నారు. భ్రమరాంబికాదేవి అమ్మవారు సోమవారం శైలపుత్రి అలంకారంలో దర్శనమివ్వనున్నారు. స్వామి, అమ్మవార్లకు భృంగి వాహన సేవ నిర్వహించనున్నారు.

ఉత్తరాంధ్రకు వాయు'గండం'

- పిడుగులతో భారీ వర్షాలు పడతాయని హెచ్చరిక
- బెజవాడలో 13 సెంటీమీటర్ల వర్షం.. నేడు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు

విశాఖపట్నం/అమరావతి, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి):ఉత్తరాంధ్రకు వాయుగుండం పొంచి ఉంది. ఈ నెల 26న వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం 27న ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా మధ్య తీరం దాటనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా ప్రాంతాలకు ఎక్కువగా ఉంటుందని, కొన్నిచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. సోమవారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. దీంతో సోమ, మంగళవారాల్లో ఉత్తరాంధ్రలో వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఈ నెల 25న తూర్పుమధ్య, ఈశాన్య బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుంది. మూడు రోజుల వ్యవధిలో ఏర్పడనున్న రెండు అల్పపీడనాల ప్రభావంతో ఈనెల 24 నుంచి 27 వరకు కోస్తా, రాయలసీమలో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. మరోవైపు, కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల పిడుగులు, ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. విజయవాడ సింగ్‌నగర్‌లో 13, చిత్తూరు జిల్లాలోని కాగితలో 8.3, ఏలూరు జిల్లా కాకర్లమూడిలో 8, ప్రకాశం జిల్లా సింగరాయకొండలో 6.9, చిత్తూరులోని యాదమర్రిలో 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం రాష్ట్రంలో పలుచోట్ల ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు, ఒకట్రెండుచోట్ల భారీ వర్షాలు కురుస్తాయని నిపుణుడొకరు తెలిపారు.

అప్పన్న సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి



కప్పస్తంభం వద్ద జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్

సింహాచలం, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామిని ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మానవేంద్రనాథ్‌రాయ్ దర్శించుకున్నారు. ఆయనకు దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు అధికార లాంఛనాలతో ఆహ్వానం పలికారు. న్యాయమూర్తి కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడామండప ప్రదక్షిణ చేసిన అనంతరం అంతరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గోదాదేవి అమ్మవారి సన్నిధిలో కుంకుమ పూజలు తరువాత పండితులు ఆశీర్వచనాలీయగా, ఈఓ శాలువతో సత్కరించి స్వామివారి ఫొటోను జ్ఞాపికగా అందజేశారు.

నేటి నుంచి విశాఖలో 28వ జాతీయ ఈ గవర్నెన్స్ కాన్ఫరెన్స్

- ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుంది
- కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి

విశాఖపట్నం, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): విశాఖ వేదికగా 28వ జాతీయ ఈ-గవర్నెన్స్ కాన్ఫరెన్స్‌ను ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్నట్టు కేంద్ర పరిపాలన సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల శాఖ కార్యదర్శి వి.శ్రీనివాస్ వెల్లడించారు. విశాఖలో ఆదివారం మాట్లాడుతూ.. వికసిత్ భారత్, సివిల్ సర్వీసెస్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ థీమ్‌తో సదస్సు ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ కాన్ఫరెన్స్‌ను ప్రారంభిస్తారన్నారు. ఏపీలో వాట్సాప్ గవర్నెన్స్ అమలుతీరు బాగుందని, ప్రస్తుతం 738 రకాలు సేవలు అందిస్తున్నారని, దీనిని దేశంలోనే అత్యుత్తమ మోడల్‌గా అభివర్ణించారు. విశాఖ డిక్లరేషన్‌లో దీనిని భాగం చేసి దేశమంతా అమలు చేసేందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలోని పలు రాష్ట్రాల నుంచి 200 మందికిపైగా ప్రతినిధులు సదస్సులో పాల్గొంటారన్నారు. అత్యుత్తమ కార్యక్రమాలు నిర్వహించిన వారికి ఈ గవర్నెన్స్- 2025 అవార్డులు అందిస్తామన్నారు.

కూటమి నేతలపై అనుచిత పోస్టులు

- వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త అరెస్టు



వైసీపీ మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్‌తో అంజాద్ ఖాన్ (ఫైల్)

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు పెట్టిన వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తను శ్రీసత్యసాయి జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు ఎస్పీ సతీష్‌కుమార్ ఆదివారం వెల్లడించారు. కదిరి పట్టణానికి చెంది న కౌలేపల్లి అంజాద్‌ఖాన్ అలియాస్ మెగా అంజాద్ వైసీపీ కోఆర్డినేటర్‌గా వ్యవహరిస్తుండేవాడు. రెండ్రోజుల క్రితం సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై అనుచిత పోస్టులు పెట్టడంతో అరెస్టు చేసినట్లు తెలిపారు.

తిరుమలేశుడి బ్రహ్మోత్సవాలకు రేపు అంకురార్పణ

- ఎల్లుండి ధ్వజారోహణంతో ఉత్సవాలు ఆరంభం

తిరుమల, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవేంకటేశ్వరుని సాలకట్ల బ్రహ్మోత్సవాలను ప్రారంభించడానికి మంగళవారం అంకురార్పణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలో సేనాధిపతిని అలంకరించి విశేష సమర్పణ గావిస్తారు. అనంతరం తిరుచ్చిపై ఆశీనులు చేస్తారు. రాత్రి ఏడు గంటలకు ఆలయం నుంచి బయల్దేరి నాలుగు మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తారు. తర్వాత ఆలయానికి చేరుకున్న అనంతరం రంగనాయకమండపంలో ఆస్థానం జరుగుతుంది. యాగశాలలో అర్చకస్వాములు ఆగమోక్తంగా కైంకర్యాలు నిర్వహించి అంకురార్పణ(బీజవాపం) కార్యక్రమం నిర్వహిస్తారు. 24వ తేదీన ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభవుతాయి.

తప్పుడు వార్తలను నమ్మకండి

- కపిలతీర్థంలో ఎలాంటి తొక్కిసలాట జరగలేదు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు21(ఆంధ్రజ్యోతి): తిరుమలలో తొక్కిసలాట జరిగిందని, కపిలతీర్థంలో ఏర్పాట్లు చేయలేదని సోషల్ మీడియాలో చేస్తున్న తప్పుడు వార్తలను భక్తులు నమ్మవద్దంటూ టీటీడీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపింది. 'మహాలయ అమావాస్య సందర్భంగా తిరుపతి కపిలతీర్థం ఆలయం బయట ప్రైవేట్ వ్యక్తులు పితృతర్పణాల కార్యక్రమం చేసుకోవడం ఆనవాయితీ. ఈక్రమంలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక క్యూలైన్‌ను టీటీడీ ఏర్పాట్లు చేసింది. రద్దీ నేపథ్యంలో భద్రతాపరంగా పటిష్ఠ చర్యలు తీసుకున్నాం. ఎస్పీ వాహనం, పోలీస్ వాహనం రావడంతో తొక్కిసలాట జరిగినట్టు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. తిరుమలకు ఏమాత్రం సంబంధం లేకపోయినా ఇక్కడ తొక్కిసలాట అని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. కొంతమంది టీటీడీని లక్ష్యం చేసుకుని దుష్ప్రచారం చేయడం సరికాదు. టీటీడీ ప్రతిష్ఠను పలుచన చేయడాలని చూడటం వారి దిగజారుడుతనానికి నిదర్శనం. ఇలాంటి వార్తలను నమ్మవద్దని విజ్ఞప్తి చేస్తున్నాం. టీటీడీపై దుష్ప్రచారం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం' అంటూ టీటీడీ తన సోషల్ మీడియా ద్వారా పేర్కొంది.

విజ్ఞాన్ వర్సిటీలో 62వ జాతీయ చెస్ చాంపియన్ షిప్ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న డాక్టర్ లావు రత్తయ్య తదితరులు

గుంటూరు విద్య, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 62వ నేషనల్ చెస్ చాంపియన్‌షిప్ పోటీలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథిగా హాజరైన ద్రోణాచార్య అవార్డు గ్రహీత కోనేరు అశోక్ మాట్లాడుతూ ఆలిండియా చెస్ ఫెడరేషన్ విభాగంలోని ఆంధ్ర చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ సహకారంతో పోటీలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. విశ్వనాథన్ ఆనంద్, హరికృష్ణ, హంపి, హరిదాసన్, ప్రగ్యానంద లాంటి ప్రతిభావంతులు దేశానికి ఎనలేని కీర్తి తెచ్చారని అశోక్ కొనియాడారు. విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య మొదటగా ఒక ఎత్తు వేసి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలిండియా చెస్ ఫెడరేషన్ జాయింట్ సెక్రటరీ లాల్‌తమునా, చీఫ్ ఆర్బిటర్ అనంత రామన్, ఆంధ్ర చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఏ.సురేష్, చీఫ్ అడ్వయిజర్ కేవీవీ శర్మ, సెక్రటరీ కే.జగదీష్, గుంటూరు చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సీహెచ్ రవీంద్ర రాజు, దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన ఆటగాళ్లు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27లోపు డిమాండ్లు పరిష్కరించాలి

- లేదంటే పెన్షన్ పంపిణీని నిలిపేస్తాం
- ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ

పెనమలూరు, సెప్టెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఈనెల 27 లోపు తమ డిమాండ్లను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్చలకు పిలవని పక్షంలో అక్టోబరు 1 నుంచి పెన్షన్ పంపిణీని నిలుపుదల చేసేందుకు వెనుకాడబోమని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల జేఏసీ హెచ్చరించింది. పోరంకిలో ఆదివారం జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బగ్గా జగదీష్ మీడియాతో మాట్లాడారు. ఈ నెల 23, 24, 25 తేదీల్లో కలెక్టర్లకు, ఇతర అధికారులకు జేఏసీ తరఫున నోటీసులు అందజేస్తామన్నా రు. 26, 27 తేదీల్లో ప్రభుత్వ అధికారులు నిర్వహిస్తున్న అఫిషియల్ వాట్సాప్ గ్రూపుల నుంచి ఉద్యోగులందరూ స్వచ్ఛందంగా వైదొలుగుతారన్నారు. 28న రాయలసీమ వేదికగా కర్నూలు జిల్లాలో ప్రాంతీయ సమావేశం ఏర్పాటుచేసి తదుపరి కార్యాచరణను విడుదల చేస్తామని తెలిపారు.

బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఎదురుచూపులు

పాయకరావుపేటలో రూ.3.59 కోట్ల అంచనాతో 49 పనులు మంజూరు

- పూర్తయినవి 35, వివిధ దశల్లో 10, ప్రారంభం కానివి 4
- పూర్తయిన పనులకు రూ.1.84 కోట్లకు బిల్లులు అప్‌లోడ్
- రూ.74 లక్షలు విడుదల.. ఇంకా బకాయిలు రూ.1.1 కోట్లు
- ఎనిమిది నెలలుగా విడుదల కాని బకాయిలు
- త్వరలో నిధులు విడుదల : పీఆర్ జేఈ కచేరి



బృందావనం ఎంపీపీ స్కూల్ వద్ద కొత్తగా వేసిన సీసీ రోడ్డు

పాయకరావుపేట, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో 'పల్లె పండుగ' కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లుల కోసం కాంట్రాక్టర్లు ఎదురుచూపులు చూస్తున్నారు. చేసిన పనులకు నెలల తరబడి బిల్లులు మంజూరు కాక ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో కొత్తగా సీసీ రోడ్లు, డ్రెయిన్లు మరమ్మతులకు సంబంధించి గతేడాది ప్రభుత్వం చేపట్టిన 'పల్లె పండుగ' ద్వారా మండలంలోని 24 పంచాయతీల్లో రూ.3.59 కోట్లతో 49 అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ పనులు పూర్తిచేస్తే కాంట్రాక్టర్లకు త్వరితగతిన బిల్లుల చెల్లింపులు జరుగుతుందని అధికారులు చెప్పడంతో గ్రామ స్థాయిలో అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకువచ్చి చేపట్టారు. ఉపాధి హామీ పథకంలో మెటీరియల్ కాంపోనెంట్‌గా చేపట్టిన ఈ పనులకు మొదట్లో బిల్లులకు చెల్లింపులు జరగ్గా.. గతేడాది డిసెంబరు తరువాత నుంచి నిధులు విడుదల కాలేదు. దీంతో ఈ ఏడాది జనవరిలో పూర్తిచేసిన పలు సీసీ రోడ్లతోపాటు ఆ తరువాత పూర్తిచేసిన 35 అభివృద్ధి పనులకు సంబంధించి రూ.1.84 కోట్లకు ఇంజనీరింగ్ అధికారులు బిల్లులు అప్‌లోడ్ చేయగా.. ఇప్పటివరకు రూ.74 లక్షలు విడుదలకాగా ఇంకా బకాయి రూ.1.1 కోట్లు విడుదల కావాలి. పనులు పూర్తిచేసి ఎనిమిది నుంచి పది నెలలు కావస్తున్నా బిల్లులు మంజూరుకాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిపై పీఆర్ మండల జేఈ కచేరిని వివరణ కోరగా.. మండలంలో పల్లె పండుగ కార్యక్రమంలో పూర్తిచేసిన అభివృద్ధి పనులకు రెండు దఫాల్లో రూ.74 లక్షలు విడుదల అయ్యాయన్నారు. ఇంకా రూ.1.1కోట్లు బకాయిలు ఉన్నాయన్నారు. కొద్దిరోజుల్లో నిధులు విడుదలయ్యే అవకాశం ఉందన్నారు.



తాండవ వంతెన పైనుంచి ఏటిఒడ్డు వీధికి వెళ్లేందుకు వేసిన మెట్ల దారి

ఈదురు గాలుల బీభత్సం

... 5వ పేజీ తరువాయి

జలమయమయ్యాయి. మండలంలోని గాలిభీమవరం వెళ్లే మార్గంలో లగిశెట్టిపాలెం ఎస్సీ కాలనీ వద్ద విద్యుత్ లైనుపై వేప చెట్టు కూలడంతో మూడు విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. సబ్బవరం- చోడవరం రోడ్డులో గొటివాడ వద్ద పాడి రైతు మడక సూర్యనారాయణ పశువుల కల్లం వద్ద ఈదురు గాలులకు భారీ టేకు వృక్షం ఆవుపై పడడంతో అది మృతి చెందింది. విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను యుద్ధప్రాతిపదికన చేపడుతున్నామని ఏపీఈపీడీసీఎల్ ఏఈ వీరేంద్ర తెలిపారు. కాగా గొలుగొండ మండలంలో ఆదివారం సాయంత్రం పిడుగుపాటుకు పాడి గేదె, ఆవు మృతి చెందాయి. నర్సీపట్నం, దేవరాపల్లిలో కూడా భారీ వర్షం కురిసింది.



ఎలమంచిలిలోని పెదపల్లి రోడ్డులో నేలకొరిగిన చెట్టు

జోరుగా కేజీబీవీల్లో అభివృద్ధి పనులు

... 5వ పేజీ తరువాయి

నిర్మాణ పనులు రూఫ్ స్థాయిలో ఉన్నాయి. దేవరాపల్లి, కె.కోటపాడు, కశింకోట మండలాల్లో గ్రౌండ్ ఫ్లోర్ శ్లాబ్ స్థాయిలో, పైఅంతస్తు ఫ్లోర్ రూఫ్ లెవిల్‌లో పనులు జరుగుతున్నాయి. కోటవురట్ల గ్రౌండ్ ఫ్లోర్ శ్లాబ్ స్థాయిలో, మాకవరపాలెం గ్రౌండ్ ఫ్లోర్ చివరి దశలో, పైఅంతస్థు శ్లాబ్ దశలో పనులు జరుగుతున్నాయి. నర్సీపట్నం, నాతవరం, రావికమతం శ్లాబ్ లెవిల్‌లో పనులు జరుగుతున్నాయి. రోలుగుంటలో మాత్రం బేస్‌మెంట్ లెవిల్‌లో పనులు కాస్త నెమ్మదిగా సాగుతున్నాయి. మాడుగులలో గ్రౌండ్‌ఫ్లోర్ శ్లాబ్ దశలో, ఫస్ట్ ఫ్లోర్ కాలమ్స్ దశలో పనులు జరుగుతున్నాయి. ఎస్.రాయవరం మండలాల్లో కాంట్రాక్టరు పనులు చేపట్టకపోవడంతో మళ్లీ టెండర్లు పిలిచారు. త్వరలోనే ఆయా నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని సమగ్ర శిక్ష అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని కేజీబీవీల్లో ప్రస్తుతం జరుగుతున్న అదనపు గదులు, మౌలిక వసతుల కల్పన పనులు పూర్తయితే విద్యాలయాల్లో విద్యార్థుల సమస్యలు పరిష్కారమవుతాయని జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ జయప్రకాశ్ తెలిపారు. వాస్తవానికి భవన నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు డిసెంబరు నెలాఖరు వరకు గడువు ఉందని, అయితే రెండు నెలల ముందుగానే పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో నిర్మాణాలు జరుగుతున్నాయని ఆయన తెలిపారు.

ఆగని ఇసుక దోపిడీ

... 5వ పేజీ తరువాయి

పట్టుకున్నారు. సముద్రతీరం వద్ద ఇసుకను తరలిస్తున్నారన్న సమాచారం మేరకు తహశీల్దార్ శ్రీనివాసరావు ఆదేశాలతో అర్ధరాత్రి నిఘా వేసి ట్రాక్టర్‌ను పట్టుకున్నట్టు వీఆర్ఏలు తెలిపారు. ఇసుకలోడుతో ఉన్న ట్రాక్టర్‌ను తహశీల్దార్ కార్యాలయానికి తరలించామని చెప్పారు.

గోవాడ చెరకు రైతుల ఆందోళన బాట

... 5వ పేజీ తరువాయి

సమాచారం. గతంలో కొవిడ్ సమయంలో ఆంక్షల కారణంగా 2020లో మహాజన సభ వాయిదా పడింది. ఈసారి ఏ కారణం చూపి మహాజన సభ వాయిదా వేస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ఫ్యాక్టరీ మహాజన సభ నిర్వహిస్తే ఫ్యాక్టరీ భవితవ్యంపైనా, చెరకు రైతుల బకాయిలకు ఓ పరిష్కారమార్గం దొరికే అవకాశం ఉన్నప్పటికీ, మహాజన సభ నిర్వహణపైనా సందిగ్ధం నెలకొనడంతో మహాజన సభ నిర్వహించాలని రైతాంగం నుంచి డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గోవాడ షుగర్స్ మహాజన సభపై జిల్లా కలెక్టర్ ఏ నిర్ణయం తీసుకోబోతున్నారనేది ఆసక్తిగా మారింది. ఇదే సమయంలో గోవాడ షుగర్స్ మహాజన సభ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ సోమవారం రైతులు సచివాలయాల్లో వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించడం గమనార్హం. మొత్తం మీద ఫ్యాక్టరీని కాపాడాలని, కొనసాగించాలని రైతులు, కార్మికుల నుంచి డిమాండ్లు పెరుగుతుండడంతో గోవాడ భవితవ్యం ఏ విధంగా ఉంటుందోనని రాజకీయ వర్గాల్లో సైతం చర్చ సాగుతోంది.

తప్పిన పెను ప్రమాదం

... 5వ పేజీ తరువాయి



యాసిడ్ ట్యాంకర్

అగ్నిమాపక సిబ్బంది, హైవే పెట్రోలింగ్, నేషనల్ హైవే అథారిటీస్ సిబ్బంది, స్థానిక పోలీసులు అక్కడకు చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలను స్థానిక పోలీసులు చేపట్టారు. ఈ ప్రమాదంలో ఆర్టీసీ బస్సు ముందు భాగం దెబ్బతింది. దీనిపై నక్కపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

మొరాయించిన జోలాపుట్ నైట్‌హాల్ట్ బస్సు

మాడుగుల ఘాట్ రోడ్డు జంక్షన్‌లో సాంకేతిక లోపం

కండిషన్ బస్సును నడపాలని డిమాండ్



మాడుగుల ఘాట్ రోడ్డు సమీపంలో ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

ముంచంగిపుట్టు, సెప్టెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జోలాపుట్-విశాఖ నైట్‌హాల్ట్ బస్సు ఆదివారం మాడుగుల ఘాట్‌రోడ్డు జంక్షన్‌లో ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఆ సమయంలో బస్సులో 60 మందికి పైగా ప్రయాణికులు ఉన్నారు. ఆర్టీసీ బస్సు సాంకేతిక లోపంతో నిలిచిపోవడం, ఆ సమయంలో ఇతర బస్సులు లేకపోవడంతో పిల్లా పాపలు, లగేజీలతో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. కొంతసేపు తర్వాత అటుగా వచ్చిన ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు. జోలాపుట్టు నుంచి ముంచంగిపుట్టు మీదుగా విశాఖ వెళ్లేందుకు ఉన్న ఒక్క బస్సు తరచూ మొరాయిస్తుండడంతో ఆ బస్సు ఎక్కాలంటే ప్రయాణికులు భయపడుతున్నారు. తరచూ మార్గమధ్యలో ఆగిపోతున్నా ఆర్టీసీ అధికారులు వాటి బాగోగులపై కనీసం దృష్టి సారించడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే బస్సు గత సోమవారం మధురవాడలో బయలుదేరి విశాఖ ద్వారకానగర్ బస్‌స్టాప్ వద్ద సాయంత్రం 3 గంటల సమయంలో మొండికేసింది. దీంతో సాయంత్రం ఆరు గంటలకు మరో బస్సును ఆర్టీసీ అధికారులు ఏర్పాటు చేశారు. ఆ బస్సు కూడా చోడవరం సమీపానికి వచ్చేసరికి హెడ్‌లైట్లు పోయాయి. వాటిని అనకాపల్లి ఆర్టీసీ డిపో నుంచి మెకానిక్‌లు వచ్చి మరమ్మతులు చేశారు. దీంతో రాత్రి తొమ్మిది గంటలకు ముంచంగిపుట్టు చేరుకోవలసిన బస్సు తెల్లవారు మూడు గంటలకు వచ్చింది. బస్సులో ఉన్న ప్రయాణికులు తిండీ తిప్పలు లేకుండా అలమటించారు. ఉన్న ఒక్క సర్వీసు కూడా డొక్కు బస్సును నడుపుతుండడంపై ప్రయాణికులు మండిపడుతున్నారు. ఆర్టీసీ అధికారులు జోలాపుట్‌కు కొత్త బస్సును నడపాలని ఈ ప్రాంతవాసులు డిమాండ్ చేస్తున్నారు.

దూర విద్య ఫలితాలెన్నడో?

... 5వ పేజీ తరువాయి

ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నత చదువుల కోసం ఆరాటపడే వారంతా ఆశలు వదులుకునే పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నెలలు గడుస్తున్నా..

ఈ ఏడాది మార్చిలో దూరవిద్య డిగ్రీ, పీజీ సెమిస్టర్, సప్లిమెంటరీ పరీక్షలను నిర్వహించారు. ఆయా కోర్సులకు సంబంధించి సుమారు 12 వేల మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వీరంతా ఇతర ఉన్నత విద్యా కోర్సుల్లో చేరాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పరీక్షలు ముగిసినప్పటి నుంచి ఫలితాల కోసం ఎదురుచూస్తున్నారు. నెలలు గడుస్తున్నా అధికారులు స్పందించకపోవడంతో వారిలో ఆందోళన నెలకొంది. జాప్యానికి కారణాలపై అధికారులను ప్రశ్నిస్తున్నా సమాధానం లభించడం లేదంటున్నారు. ఎప్పుడు ఫలితాలు విడుదల చేస్తారో కూడా స్పష్టత ఇవ్వడం లేదని వాపోతున్నారు.

ప్రారంభమైన మూల్యాంకనం..

దూరవిద్య విద్యార్థుల నుంచి ఫలితాలపై తీవ్రస్థాయిలో ఒత్తిడి వస్తుండడంతో అధికారులు తాజాగా అప్రమత్తమ య్యారు. గత వారం రోజులుగా మూల్యాంకనం ప్రక్రియ ను ప్రారంభించినట్టు తెలుస్తోంది. పరీక్షలు ముగిసి ఐదు నెలలు దాటింది. ఇప్పటివరకు జవాబుపత్రాల మూల్యాం కనం చేయకుండా అధికారులు ఏం చేశారన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ దశలో ఎప్పుడు ఫలితాలు వెల్లడిస్తారో తెలియని పరిస్థితి. దీనిపై ఏయూ దూర విద్య డైరెక్టర్ అప్పలనాయుడును వివరణ కోరగా.. సాంకేతిక కారణాలతో మూల్యాంకనం ఆలస్యమైందన్నారు. ఇప్పటికే ప్రక్రియను ప్రారంభించామని, కొద్దిరోజుల్లో ఫలి తాలు వెల్లడిస్తామన్నారు.

విద్యార్థుల నిరీక్షణ..

ఏయూ దూర విద్య కోర్సులకు డిమాండ్ ఉంది. దీంతో అనేక వర్సిటీల్లో ఈ అవకాశం ఉన్నప్పటికీ ఇక్కడ చేరేం దుకు విద్యార్థులు ఆసక్తి చూపిస్తుంటారు. ప్రస్తుతం ఫలితాల కోసం ఎదురుచూస్తున్న వారిలో బీఏ, బీకాం, బీఎస్సీ, ఎమ్మెస్సీ సైకాలజీ, తెలుగు తదితర కోర్సుల్లో చేరిన విద్యార్థులున్నారు.